



అల్లూరి జిల్లాలోని మోతుగూడెంలో భారీవర్షాలకు ఉరకలేస్తున్న పొల్లూరు జలపాతం

వాయుగండం

- బంగాళాఖాతంలో వాయుగుండంగా ముదిరిన తీవ్ర అల్పపీడనం
- దీని ప్రభావంతో నేడు జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాల ముప్పు
- కాకినాడ పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు
- తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం
- వరదనీటితో జిల్లాలోని 16మండలాల్లో 7,250 ఎకరాల్లో వరి పంటల మునక
- గొల్లప్రోలులో సుద్దగడ్డకు వరద పోటు.. వేలాది ఎకరాల మునక
- ఏలేరు, తాండవ, సుబ్బారెడ్డిసాగర్‌కు పోటెత్తుతున్న వరద.. భారీగానే ఇన్‌ఫ్లో
- సముద్రం అల్లకల్లోలంతో పోర్టులో నౌకల్లోకి బియ్యం ఎగుమతులు నిలిపివేత



గొల్లప్రోలు పట్టణ శివారుకు వెళ్లే రహదారి, పంటపొలాలను ముంచిన సుద్దగడ్డ వరద నీరు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కాస్తా వాయుగుండంగా బలపడింది. దీంతో జిల్లాకు మంగళవారం కూడా పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్ష హెచ్చరిక జారీ అయింది. అటు కాకినాడ పోర్టులోను మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సోమవారం సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఉప్పాడ వద్ద అలల తీవ్రత అధికమై పలుచోట్ల కెరటాలు బీచ్‌రోడ్డును తాకాయి. అటు సముద్రం లోపల ఈదురుగాలులు గంటకు 40కిలోమీటర్ల వేగంతో వీచాయి. దీంతో ఆఫ్రికా దేశాలకు బియ్యం ఎగుమతి కోసం వచ్చిన రెండు నౌకల్లోకి బియ్యం లోడింగ్‌ను నిలిపివేశారు. మంగళ వారం కూడా లోడింగ్ ఆపేయనున్నారు. ఒక నౌకలో ఇంకా 3వేల మెట్రిక్ టన్నులు, మరో నౌకలో ఇంకా 30శాతం బియ్యం ఎగుమతి చేయాల్సి ఉంది. కాగా వాయుగుండం ప్రభా వంతో కాకినాడ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్‌రూంలను అధికారులు కొనసాగిస్తున్నారు. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సోమవారం జిల్లావ్యాప్తంగా అనేకచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో వర్షంనీటి ఉధృతితో 16 మండలాల్లోని 85గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. సుద్దగడ్డ, సుబ్బారెడ్డిసాగర్‌కు వరద నీరు పోటెత్తుతుండడంతో వేలాది ఎకరాలు పంటలు చెరువుల్లా మారాయి.

రోజంతా ముసురు..వానే..

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారింది. దీనిప్రభావంతో సోమవారం జిల్లావ్యాప్తంగా రోజంతా వర్షం కురిసింది. అటు ముసురు వాతావరణ నెలకొనడంతో బయట జనజీవనం కూడా స్తంభించింది. పలుచోట్ల మినహా మిగిలిన మండలాల్లో రోజంతా ఓమోస్తరు వర్షం కురవడంతో అత్యధికంగా జగ్గంపేటలో 18మిల్లీమీటర్లు, ఏలేశ్వరంలో 9.5మి.మి. చొప్పున వర్షపాతం నమోదవగా మిగిలిన మండలాల్లో 9 నుంచి 4 మిల్లీమీటర్లలోపు వర్షపాతం నమోదైంది. తీవ్ర అల్పపీడనంగా వాయుగుండంగా మారడంతో దీని ప్రభావంతో జిల్లాలో మంగళవారం పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఒకపక్క ఎడతెరిపి లేని వర్షాలు, మరోపక్క ఎగువ నుంచి వస్తోన్న నీటితో సుద్దగడ్డకు వరద పెరిగింది. దీంతో గొల్లప్రోలు మండలంలో కొత్తకాలనీకి వెళ్లే దారి మొత్తం మునిగిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలనీకి వెళ్లే వారిని అధికారులు బోట్లలో తరలించారు. వర్షాలు కొనసాగుతుండడం, వరద ఇంకా పెరిగే ప్రమాదం ఉండడంతో పలు కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ప్రత్తిపాడు మండలం సుబ్బారెడ్డిసాగర్‌కు సైతం క్రమేపీ వరద పెరుగుతోంది. ప్రస్తుతం 35క్యుసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఏలేరు రిజర్వాయర్‌కు సైతం 7,260క్యుసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. తాండవలోకి 2,765 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎడతెరిపి లేని వర్షాలు, ఎగువనుంచి వస్తోన్న నీటితో జిల్లాలో పలుచోట్ల పంటలు నీటమునుగుతున్నాయి. ప్రధానంగా కాలువలు, చెరువుల సమీపంలో ఉన్న పంటపొలాల్లోకి నీరు అధికంగా చేరుతోంది. దీంతో పలుచోట్ల వరిచేలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి.దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇంతవరకు జిల్లాలో 61,405హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయి.తాజా వర్షాలతో జిల్లాలో 16 మండలాల్లోని 85గ్రామాల్లో 2,906మంది రైతులకు చెందిన 2,917హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. వర్షాల ముప్పు కొనసాగుతుండడంతో వరి పంట మరింత దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



ప్రత్తిపాడు మండలంలో నీట మునిగిన వరి పంట



చింతూరు మండలంలోని సోకిలేరు వాగులో నాటు పడవపై గ్రామస్థుల ప్రయాణం



పిఠాపురం, గొల్లప్రోలు మధ్య ఉధృతంగా ఏలేరు కాలువ

ఏలేరుకు పెరిగిన ఇన్‌ఫ్లోస్

పిఠాపురం/గొల్లప్రోలు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఏలేరు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోస్ భారీగా పెరిగాయి. ఏజెన్సీతోపాటు ఎగువప్రాంతాల నుంచి నీరు రావడంతో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం 6గంటల సమయానికి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు 12.37 టీఎంసీలకు చేరుకున్నాయి. రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటిమట్టం 86.56మీటర్ల వద్ద 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం నీటిమట్టం 79.05మీటర్లుగా ఉంది. పరివాహక ప్రాంతాలు నీరు వస్తుండడంతో ఉదయం నుంచి ఇన్‌ఫ్లోస్ పెరుగుతూ 6,735 క్యూసెక్కులకు చేరుకోగా పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న నీరు 525 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం మొత్తం ఇన్‌ఫ్లోస్ 7,260 క్యూసెక్కులు ఉండగా, విశాఖ స్టీల్‌ప్లాంటుకు 220 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏలేరు పరిధిలో ఆయకట్టుకు నీటి విడుదలను నిలిపివేశారు. వర్షాల నీరు చేరడంతో పిఠాపురం, గొల్లప్రోలు వద్ద ఏలేరు కాలువలు వర్షపునీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

గర్భిణులు, బాలింతలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు

గొల్లప్రోలు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రహదారులను సుద్దగడ్డ వరద నీరు ముంచెత్తిన నేపథ్యంలో గొల్లప్రోలు కొత్తకాలనీ నుంచి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, ఆరోగ్య అవసరాలు కలిగిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇందునిమిత్తం కలెక్టర్ ఆదేశాల మేరకు అగ్నిమాపకశాఖకు చెందిన ఫైబర్‌బోటును ఏర్పాటు చేశారు. దీనిద్వారా అధికారులు దగ్గరుండి బాలింతలు, ముగ్గురు గర్భిణులను ఎక్కించారు. వీరిని వారి బంధువుల ఇళ్లకు పంపించారు. తరలింపులో తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీవో దుర్గాదేవి, గొల్లప్రోలు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ అమృతరావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ, ఆర్‌ఐ బాలకృష్ణ పాలుపంచుకున్నారు.



గొల్లప్రోలు కొత్తకాలనీ నుంచి గర్భిణులు, బాలింతలను తీసుకువస్తున్న అధికారులు

జిల్లాలో వర్షపాతం వివరాలు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం 8.30గంటలకు 844 మి.మీ వర్షపాతం నమోదైంది. తొండంగి మండలంలో అత్యధికంగా 55.2 మి.మీ నమోదు కాగా శంఖవరం మండలంలో 54.2, గొల్లప్రోలు మండలంలో 52.2, పిఠాపురం మండలంలో 51.6, కోటనందూరు మండలంలో 50.2, యు.కొత్తపల్లి మండలంలో 50.2 వర్షపాతం నమోదైంది. జగ్గంపేట మండలంలో 32.6, గండేపల్లి 23.4, ఏలేశ్వరం 45.2, ప్రత్తిపాడు 42.4, రౌతులపూడి 48.2, కిర్లంపూడి 46.2, పెదపూడి 22.4, పెద్దాపురం 32.2, తుని 49.6, సామర్లకోట 34.0, కరప 29.2, కాకినాడఅర్బన్ 29.4, కాజులూరు 31.2, కాకినాడ రూరల్ 36.4, తాళ్లరేవులో 29.8 వర్షపాతం నమోదైంది. సరాసరి వర్షపాతం 40.2 మి.మీ నమోదైంది. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరిశీలిస్తే జిల్లావ్యాప్తంగా 98.4మి.మీ వర్షపాతం నమోదైంది. దీనిలో జగ్గంపేట మండలంలో అత్యధికంగా 21.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

నేడే 'పీ4' ప్రారంభం

- తొలుత ఆరు జిల్లాల్లో ప్రారంభం
- తర్వాత ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో..

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీ4బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ కార్యక్రమం పథకం మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబు ప్రారంభిస్తున్నారు. తొలుతగా 6 జిల్లాల్లో పథకాన్ని ప్రారంభిస్తున్నారు. దీనిలో ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాలు ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తర్వాత ప్రారంభించనున్నారు. మన ఉమ్మడి జిల్లాలో పీ 4 బంగారు కుటుంబాల దత్తతస్వీకరణ లక్ష్యం 2లక్షల 19వేలుకాగా దాన్ని 2లక్షల11వేలకు కుదించారు. దీనిలో ఇప్పటివరకు 1,64,249 బంగారు కుటుంబాలను ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, ఎన్‌జీవోలు దత్తత స్వీకరించారు. ఇంకా 46,751 కుటుంబాలను దత్తత స్వీకరించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. బంగారు కుటుంబాలకు అవసరాలు ఏంటో తెలుసుకోవడానికి కుటుంబ అవసరాల(నీడ్ అసెస్మెంట్) సర్వేను కూడా విజయవంతంగా నిర్వహించారు. మిగిలిన లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు మార్గదర్శులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకవైపు విజయవాడ నుంచి సీఎం చంద్రబాబు పథకాన్ని ప్రారంభిస్తుండగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ పథకం ప్రారంభించడానికి ఎలాంటి సన్నాహాలు జరగడంలేదు. దీంతో రెండో విడతలో ఇక్కడ పథకాన్ని ప్రారంభించే అవకాశాలున్నాయని తెలిసింది.

అనర్హుల ఏరివేత

- జిల్లాలో 4,227 దివ్యాంగుల పింఛన్లు తొలగింపు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 35,291 మంది దివ్యాంగ కేటగిరీలో పింఛన్‌దారులు ఉండగా 23,326మందికి సదరం రీ-అసెస్‌మెంట్ పరీక్షలు పూర్తిచేశారు. దీనిలో 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నవారు 4,227మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిని అనర్హులుగా పరిగణిస్తూ పింఛన్లు నిలుపుదల చేశారు. ఈ మేరకు అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. సదరం రీ-అసెస్‌మెంట్ పరీక్షలు అనంతరం జిల్లాలో 311మంది హెల్త్ పింఛన్ల కింద రూ.15వేలు పొందతున్నవారిలో 57 పింఛన్లను దివ్యాంగుల పింఛన్లు అంటే రూ.6వేలకు పరిమితం చేశారు. ఇద్దరివి వృద్ధాప్య పింఛన్లుగా మార్పు చేశారు. ఈ కేటగిరీలో ఐదుగురు పింఛన్లు రద్దు చేశారు. ఈ మేరకు వివరాలను కాకినాడ డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో..

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వచ్చే రెండురోజుల్లో కాకినాడలో భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రత్యేక అధికారులు తమ సిబ్బందిని సిద్ధంగా ఉంచి వర్షాల కారణంగా కలిగే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రధాన కాలువల్లో నీరు నిలిచిపోకుండా ఎక్స్‌కవేటర్లు సిద్ధంగా ఉంచాలని, నీరు నిలిచే ప్రాంతాల్లో మోటార్లను అందుబాటులో ఉంచాలని అసిస్టెంట్ ఇంజనీర్లకు సూచించారు.పడిపోయే చెట్లను తొలగించేందుకు హార్టీకల్చర్ విభాగం, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా మంచినీటి సరఫరా విభాగం సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థలో ఎక్కడా నీరు నిల్వకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని, రాత్రిపూట అత్యవసర పనుల కోసం ప్రతి స్కిల్‌లో కనీసం 10మంది కార్మికులు, మేస్త్రీ, ట్రాక్టర్ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, ఎస్‌ఈ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, ఏఈ, డీఈలు పాల్గొన్నారు.

కాకినాడ కమిషనర్ భావన ఆదేశాలు

జిల్లాలో గణేశ్ ఉత్సవాలు కాలుష్య రహితంగా..

నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి

- జేసీ రాహుల్‌మీనా



కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 27 నుంచి సెప్టెంబరు 5 వరకు జరిగే వినాయక చవితి ఉత్సవాలు కాలుష్య రహితంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం వినాయక చవితి ఉత్సవాల నిమజ్జన కార్యక్రమాల నిర్వహణపై ఆయన రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, కాలుష్య నియంత్రణ, వైద్యఆరోగ్యం, అగ్నిమాపక, పంచాయతీ, మత్స్యశాఖ, కాకినాడ నగర గణేశ్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న వినాయక చవితి కాలుష్య రహితంగా నిర్వహించాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణానికి హాని లేకుండా శాంతియుతంగా నిర్వహించాలన్నారు. జిల్లా, డివిజన్, మండలస్థాయిలో ఉత్సవ కమిటీలతో శాంతి సమావేశాలు నిర్వహించాలన్నారు. విగ్రహాల తయారీకి రసాయనాలను రంగులను వాడకుండా ఉండాలన్నారు. కేవలం సహజసిద్ధమైన రంగులనే వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. మట్టితో చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించేలా ఉత్సవ కమిటీలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబరు 6, 7వ తేదీల్లో నిర్వహించే నిమజ్జన కార్యక్రమాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఘాట్లవద్ద స్టేజ్, తాగునీరు, విద్యుత్, బారికేడింగ్, హైడ్రా లిక్ క్రేన్లు, ఎల్‌ఈడీ లైటింగ్, ఫ్లడ్ లైటింగ్, మైకులు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. గజఈతగాళ్లను, పడవలను సిద్ధంగా ఉంచాలన్నారు.నిమజ్జన సమయంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కల్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, డీఎంహెచ్‌వో నరసింహానాయక్, కాకినాడ నగరపాలక సంస్థ ఎస్‌ఈ వెంకటరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకర్‌రావు పాల్గొన్నారు.

నీటమునిగిన పంటలు

- మొత్తంగా ముంపులో 3161 హెక్టార్లు
- 16 మండలాల పరిధిలో 85 గ్రామాలకు ప్రభావం
- వరి,పత్తి,రాగులకు నష్టం
- రక్షణ చర్యలు చేపట్టాలి
- వ్యవసాయశాఖ అధికారుల సూచనలు



జగ్గంపేట రూరల్‌లో నీటమునిగిన వరిపంట

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీవర్షాలకు మొత్తం 3161 హెక్టార్ల పంట పొలాలు పంట పొలాలు ముంపులో ఉన్నాయి. దీనిలో వరిపంట 2917 హెక్టార్లు, పత్తి 202 హెక్టార్లు, రాగులు 42 హెక్టార్లు ముంపులో ఉన్నాయి. దీనివల్ల 2906 మంది రైతులు ప్రభావితమయ్యారు. 16 మండలాల్లో 85 గ్రామాలు ప్రభావితమయ్యాయి. సామర్లకోట, కాకినాడ అర్బన్,కాకినాడ గ్రామీణం, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు, కరప, కాజులూరు, తాళ్లరేవు, పెద్దాపురం, కిర్లంపూడి, జగ్గంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, తొండంగి, శంఖవరం, కోటనందూరు, తుని మండలాల్లో వర్షపాతం నమోదైంది. ప్రధానంగా వరి, పత్తి, రాగులు, కంది, వేరుశనగ, ఉద్యానశాఖ పంటలకు నష్టం జరిగింది. మెట్టప్రాంతంలో ఉద్యానశాఖ పంటలకు నష్టం కలిగింది. ఈనేపథ్యంలో పంటలకు రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు ఇచ్చారు.

పంటల రక్షణకు చర్యలు ఇవిగో

వరిపంట: జిల్లాలో వరిపంట నాట్లు వేసి 20-40రోజుల దశలో ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలవల్ల 2వేల హెక్టార్లకుపైగా వరి పంట ముంపులో ఉంది. ఎంటీయూ 1318 రకం 5 నుంచి 6రోజుల వరకు ముంపు తట్టు కుంటుంది. ఎంటీయూ 1061 రకం కూడా 6 నుంచి 7 రోజులు వరకు ముంపు తట్టుకుంటుంది. బీపీటీ 5204, ఇతర రకాలు 3 నుంచి 4రోజులు వరకు ముంపు తట్టుకుంటాయి. ముంపునకు కొన్ని రోజుల ముందు ఎరువులు వేసిన పొలాల్లో నష్టం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు వరిపొలంలో నీటిని కిందికి పోయేలా చర్యలు తీసుకోవాలి. నీట మునిగిన పొలాలు త్వరగా పుంజుకోవడానికి 5 సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియాతోపాటు ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను చల్లాలి. తర్వాత లీటరు నీటికి 2గ్రాముల కార్బెండిజంతోపాటు మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. పిలకలు కట్టే దశలో ఉన్న పొలాలకు నీరు బయటకు తీసిన వెంటనే ఎకరానికి 20కిలోల యూరియాతోపాటు 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పై పాటుగా చల్లాలి. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1గ్రాము కార్బెండిజం లేదా 2గ్రాముల కార్బెండిజంతోపాటు మాంకోజెబ్ కలిపి స్ప్రేచేయాలి.

పత్తి పంట: పంటలో నిలిచిపోయిన అదనంగా ఉన్న నీటిని తొలగించాలి. ఎండగా ఉన్న సమయంలో 1-2శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. అనుకూల పరిస్థితులు వచ్చిన తర్వాత పూత, పిందె దశలో ఉన్న పంటలకు ఎకరానికి 25-30 కిలోల యూరియాతోపాటు 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను బూస్టర్ మోతాదులో చల్లాలి. ముందు జాగ్రత్తగా 90రోజుల పంటలో కాయతెగుళ్ల నివారణకు కాపర్‌ఆక్సీక్లోరైడ్ 600గ్రాములు ఎకరానికి చొప్పున పిచికారీచేయాలి. ఏపుగా పెరిగే దశలో ఆకుల మీద వచ్చే మచ్చ తెగుళ్లకు కార్బెండజమ్‌తో పాటు మాంకోజెబ్ మిశ్రమాన్ని 2.5గ్రాములు పిచికారీ చేయాలి.

నీరు నిలిచిపోకుండా చూడాలి

-జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్

రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిలో 2917హెక్టార్లు ముంపునకు గురయ్యాయి. రైతులు ఎప్పటికప్పుడు పంటపొలంలో నీరు కిందికి ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి. నీరు నిలిచిపోకుండా రక్షణచర్యలు చేపట్టాలి.పైన సూచించిన విధంగా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. జిల్లాలో 61,405 హెక్టార్లలో వరిసాగు జరిగింది. భారీ వర్షాల వల్ల కొంత సాగుకు ఆటంకం ఏర్పడింది.

బార్లకు బేరం!

- జిల్లాలో 15బార్లకు నోటిఫికేషన్
- జనాభా ప్రాతిపదికన ఫీజులు



కాకినాడ క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా 15 బార్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జనాభా ప్రాతిపదికన 50వేలలోపు జనాభాగల మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఏడాదికి రూ.35లక్షలు.. 50వేల నుంచి 5లక్షల లోపు జనాభా గల మున్సిపాలిటీ లేదా మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఏడాదికి రూ.55లక్షలుగా నిర్ణయించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారిణి ఎం.కృష్ణకుమారి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

ఎక్కడ.. ఎన్ని..


కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 11 బార్లు, సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో 1 బార్, పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో 1 బార్, పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో 1 బార్, తుని మున్సిపాలిటీ పరిధిలో 1 బార్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారిణి కృష్ణకుమారి తెలిపారు. దరఖాస్తుదారుడు దరఖాస్తుతోపాటు అప్లికేషన్ ఫీజు రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలను ఆన్‌లైన్ లేదా హైబ్రిడ్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో చెల్లించి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయం కాకినాడలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

కొత్త విధానమిలా..

2025-28 సంవత్సరాలకుగాను రాష్ట్ర ప్రభుత్వం కొత్తబార్ పాలసీని మంజూరు చేసింది. ఈ కొత్త విధానం కింద బార్లను వేలం పద్ధతిలో కాకుండా లాట్ల డ్రా పద్ధతి ఆధారంగా కేటాయిస్తారు. 2022-25 బార్ పాలసీ సమయంలో జనాభా స్లాబ్‌ను బట్టి దరఖాస్తు ఫీజు రూ.5లక్షలు, రూ.7.5లక్షలు, రూ.10లక్షలుగా నిర్ణయిస్తారు. ఆ విధానానికి భిన్నంగా కొత్త విధానం అన్ని బార్లకు రూ.5లక్షల ఒకే రకమైన అప్లికేషన్ ఫీజుతోపాటు రూ.10వేలు ప్రాసెసింగ్ ఫీజు నిర్ణయించారు. ఈ విధానం మొదటిసారి పాల్గొనే ఆశావహులకు సులభతరంగా ఉంటుందని ఎక్సైజ్ అధికారిణి తెలిపారు. ఈ విధానంలో ఒక వ్యక్తి సమర్పించగల దరఖాస్తుల సంఖ్య లేదా లైసెన్స్‌లను కలిగి ఉండడంపై పరిమితి లేదన్నారు. న్యాయబద్ధత, పారదర్శకతను బలోపేతం చేయడానికి, అవకతవకలకు పాల్పడేందుకు తావు లేకుండా ఈ విధానం ద్వారా లైసెన్స్‌లు కేటాయింపు ఉంటుందన్నారు. బార్ల నిర్వాహకులుగా కొత్తగా వచ్చే వారికి డ్రా ఆఫ్ లాట్స్ పద్ధతి న్యాయమైన అవకాశాన్ని అందిస్తుందన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి అమలులోకి వచ్చేలా సవరించిన రిటైల్ షాపు లైసెన్స్ ఫీజులు(పర్మిట్ రూమ్ ఫీజులతో సహా) ఈ కింది విధంగా ఉండేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 50వేల జనాభా ప్రాతిపదికన రూ.65.5లక్షలు, 50వేల నుంచి 5లక్షల జనాభా ప్రాతిపదికన రూ.79లక్షలు, 5లక్షల జనాభాపైబడి రూ.101 లక్షలు నిర్ణయించారు. కొత్త బార్ విధానంలో 50 వేల జనాభా ప్రాతిపదికన రూ.35లక్షలు, 50వేల నుంచి 5లక్షల జనాభా ప్రాతిపదికన రూ.55లక్షలు, 5లక్షల జనాభా పైబడి ఉంటే రూ.75లక్షలు నిర్ణయించడం ఈ కొత్త పాలసీ ప్రత్యేకత అన్నారు. ముఖ్యంగా కొత్త పాలసీలో మొత్తం లైసెన్స్ ఫీజును ఒక వాయిదాకు బ్యాంక్ గ్యారెంటీతో 6 సమాన వాయిదాల్లో చెల్లించవచ్చన్నారు.

విస్తరించిన బార్ సమయాలు

ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు బార్‌లు పనిచేస్తాయి. ఈ విధానంవల్ల అదనంగా మూడు గంటలు వ్యాపారం పెరుగుతుంది. కొత్త విధానం ప్రకారం బార్ లైసెన్స్ పొందేందుకు ముందుగా ఉన్న రెస్టారెంట్ తప్పనిసరి కాదని లైసెన్స్ పొందిన 15 రోజుల లోపు రెస్టారెంట్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఉందని ఎక్సైజ్‌శాఖ అధికారిణి కృష్ణకుమారి వెల్లడించారు.



రోడ్ కం రైలు బ్రిడ్జి చెంత..



రెండు బ్రిడ్జిల మధ్య బంగారు గోదారి..



కమనీయ దృశ్యం

'చిత్ర' కథా లోకం..

కెమెరా అంటేనే ఒక దృశ్య కావ్యం. కవిత, కథల్లానే కెమెరాకూ ప్రత్యేక భాష ఉంది. ఎన్నో భావాలకు అద్దంపడుతూ ఏదొక ఆవిష్కరణ చేస్తుంది. ఒక్కోసారి తనదైన సృజనతో, జీవకళతో ప్రాణం పోసే శిల్పిగా మారుతుంది. అలా అని కెమెరాకు చిక్కిన చిత్రాలన్నీ అపురూపం కాకపోవచ్చు. కానీ కొన్ని చిత్రాలు మాత్రం అజరామరాలు. ఒక్కో చిత్రం ఒక్కో కథ చెబుతుంది. మాటలకు దొరకని ఊసులెన్నిటినో మదిని తట్టి లేపి చూపెడుతుంది. అందుకనే కెమెరాను కళ్లతో పోల్చి చెబుతాం. అన్నట్టు ఈరోజు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం. ఆ సందర్భంలో అపురూప చిత్రాల మాలిక..

గోదావరి.. చిత్రకారులకు పెద్ద కాన్వాసు. కవులకు, రచయితలకు ఓ భావోద్వేగ ఝురి. ఎందుకంటే పౌర్ణమి రోజొక అందం.. అమావాస్య చీకటి మాటునొక రసరమ్య చందం. ఎలా చూస్తే అలా గోదావరి సాక్షాత్కరిస్తుంది. అందుకే ఎంతో సాహిత్యం, సినీ గీతాలు కోకొల్లలుగా వచ్చాయి. వస్తున్నాయి. అయినా.. అనుభూతి చెందాలంటే రాసినవి, గీసినవి చూస్తేనే వస్తుందా.. కాదు.. కాదంటారు మన ఫొటోగ్రాఫర్లు. గోదావరి అందాలను ఎన్నో కోణాల్లో పట్టి చూపారెందరో. 'ఆంధ్రజ్యోతి' రాజమహేంద్రవరం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బాబి కూడా గోదావరి అందాలను తనదైన కెమెరా కళ్లతో క్లిక్‌మనిపించారిలా..



గిరిపుత్రికల జీవన సౌందర్యం




జీవన సౌందర్యం

నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం

వేయి మాటలు చెప్పలేని భావాన్ని ఒకే ఒక్క ఫొటో చెబుతుంది. ఎన్నో భావాలనే కాకుండా గతకాలపు జ్ఞాపకాలను మళ్లీ.. మళ్లీ ఆవిష్కరించే అవకాశం ఒక్క ఫొటో వల్ల సాధ్యం. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం. ఈ సందర్భంగా శ్రామికుల కష్టాలు, గిరి పుత్రుల శ్రమైక జీవన సౌందర్యం వంటి ఈ ఛాయా చిత్రాలివి. ఇవి వారి జీవన శైలికి అద్దంపడతాయి. గిరిజన మహిళల మనుగడకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి. కొండకోనల్లో దట్టమైన అటవీ ప్రాంతంలో గిరిజన మహిళల శ్రమైక జీవనాన్ని ప్రత్తిపాడుకు చెందిన ఫొటోగ్రాఫర్ సలాది కృష్ణ ఇటీవల గిరిజన ప్రాంతం అరకు, దుబ్రిగూడ, ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లోని గిరిజన మహిళలు, యువతులపై తీసిన చాయాచిత్రాలు వారి జీవన మనుగడ కళ్లముందు ఉంచుతాయి. గిరిజనుల సంప్రదాయ వస్త్రధారణ.. కార్మికుడి కుండల తయారీలో ఏకాగ్రత, గిరిజన మహిళల ఆహార ఉత్పత్తుల అమ్మకాలు వంటి ఎన్నో ఈ ఛాయా చిత్రాలను ఆయన తన కెమెరాలో బంధించారు.

- ఆంధ్రజ్యోతి, ప్రత్తిపాడు



ప్రకృతిలో ఒదిగిపోదామా..





కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

క్రీడా పోటీలకు వేళాయే!

- ధ్యాన్‌చంద్ జయంతిని పండుగగా నిర్వహించేందుకు 'శాప్' సన్నాహాలు
- 22న కాకినాడలో మూడు జిల్లాలకు జోనల్ స్థాయి క్రీడా పోటీలు
- జిల్లాస్థాయి పోటీల విజేతలు అర్హులు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కార్పొరేషన్(కాకినాడ)-ఆంధ్రజ్యోతి: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈనెల 29న ధ్యానచంద్ జయంతి సందర్భంగా క్రీడా పండుగను ఘనంగా నిర్వహించేందుకు శాప్ కృషిచేస్తోంది. 22న కాకినాడలో మూడు జిల్లాలకు జోనల్‌స్థాయి, తర్వాత రాష్ట్రస్థాయి పోటీలను విజయవాడలో నిర్వహించనున్నారు.

14ఏళ్లు పైబడి 22ఏళ్లలోపు క్రీడాకారులు సత్తా చాటేందుకు జిల్లా, జోన్, రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) సన్నాహాలు చేసింది. 2029లో అమరావతిలో జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే రాష్ట్రవ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహించనుంది. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు దీన్ని నామమాత్రంగా జరుపుతుండగా శాప్ ఛైర్మన్ ప్రోత్సాహంతో ఈ ఏడాది ప్రత్యేకంగా రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పండుగ జరపనున్నారు. మూడు దశల్లో నిర్వహించే పోటీలకు అయ్యే ఖర్చును శాప్ భరించనుంది.

కాకినాడలోనే జోనల్ స్థాయి పోటీలు

పది క్రీడాంశాల్లో స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహిస్తారు. ఇప్పటికే జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించగా ఇక్కడ గెలుపొందిన వారికి జోనల్‌స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. జోనల్ విజేతలకు రాష్ట్రస్థాయి పోటీలను విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఇటీవల కాకినాడలోని జిల్లా క్రీడామైదానం, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాప్రాంగణాల్లో జరిగినజిల్లాస్థాయి పోటీల్లో అధికసంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు జోనల్ స్థాయి పోటీలు కాకినాడ కేంద్రంగా ఈనెల 22న జరగనున్నాయి.

క్రీడా విభాగాలు

సింగిల్స్‌డబుల్స్ బాక్సింగ్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్ 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు.

ప్రతిభను వెలికితీసేందుకే..



ఈపోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా అకాడమీల్లో అవకాశంకల్పిస్తారు. క్రీడల అభివృద్ధికి ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయి. జిల్లాలో క్రీడాసంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో జిల్లాస్థాయి పోటీలు విజయవంతంగా జరిగాయి. జట్లసభ్యులు, క్రీడాకారులు 22న కాకినాడలో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లోను, ఇక్కడి విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లోను పాల్గొంటారు.

-శ్రీనివాసకుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కాకినాడ జిల్లా

యువతకు ప్రోత్సాహం అందించేందుకు ముందుంటాం

- టీవోసీఐసీ కోఆర్డినేటర్ జ్యోత్స్న



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోత్స్న

దివాన్‌చెరువు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) జీవితంలో ఏదైనా సాధించాలనే నూతన ఆలోచనలు గల యువతకు ప్రోత్సాహం అందించడానికి తాము ముందుంటామని డీఎస్ఐఆర్- టెక్నోప్రెన్యూర్ ప్రమోషన్ ప్రోగ్రాం ఔట్రీచ్ కమ్ క్లస్టర్ ఇన్నోవేషన్ సెంటర్ (టీఓసీఐసీ) కోఆర్డినేటర్ ఆచార్య పి.జ్యోత్స్న అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇంస్ట్రియల్ రీసెర్చ్ (డిఎస్ఐఆర్) ఎంఎస్ఎంఈ ఆవిష్కరణల ప్రోత్సాహం, వ్యవస్థాపకత అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దీనికి నన్నయ వీసీ ప్రసన్నశ్రీ, టిఓసిఐసి కోఆర్డినేటర్ జ్యోత్స్న ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న వ్యక్తులు, అంకుర పరిశ్రమలకు విన్నూత్న ఆలోచనలు, సాంకేతిక పురోగతికి మద్దతు ఇవ్వడమే దీని లక్ష్యమని అన్నారు. వారికి ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. డీ.ఎస్.ఐ.ఆర్., పి.ఆర్.ఐ.ఎ స్.ఎం.ల పనితీరు, వాటిద్వారా ఆవిష్కర్తలు ఏ విధంగా లబ్ధి పొందవచ్చు వంటి విషయాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ నూతనశక్తితో సృజనాత్మకత, ఆవిష్కరణ ప్రయాణాన్ని ప్రారంభిద్దామన్నారు. డీఎస్ఐఆర్ గురించి వివరించారు. వేగవంతమైన సాంకేతిక పురోగతి యుగంలో ఆవిష్కరణ అవసరమన్నారు. ఆచార్య వరదరాజు నాయుడు మాట్లాడుతూ దేశంతోపాటు ప్రపంచ దేశాలలోనూ నూతనాలోచనలను ఆవిష్కరణలను ఆచరణలోకి తీసుకు వచ్చినవారే ఉన్నతశిఖరాలకు చేరుకున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, స్కిల్ డవలప్‌మెంట్ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డి. విశ్వవిద్యాలయ అధికార్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టోసిక్ ప్రిజం కార్యక్రమం

జేఎన్టీయూకే,ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే ఆధ్వర్యంలో సోమవారం టోసిక్ ప్రిజం కార్యక్రమాన్ని నిర్వహించారు. టోసిక్ ప్రిజం సమన్వయకర్త పి.జ్యోత్స్న ప్రధానవక్తగా హాజరై విద్యార్థులకు టోసిక్ ప్రిజం లక్ష్యాలు, అవకాశాలు గురించి వివరించారు. ప్రిజం పథకం సృజనాత్మక ఆలోచనలున్న వ్యక్తులకు, వారి ఆలోచనలకు వ్యాపారాత్మక మోడళ్లుగా మార్చుకునేందుకు అవసరమైన సహాయాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీకి ఆన్‌షోర్- ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల్లో

రూ.1.61 లక్షల కోట్ల పెట్టుబడులు

- రాజ్యసభలో సతీష్‌బాబు ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు

కాకినాడసిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ఆన్‌షోర్-ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల్లో 19.25 బిలియన్ అమెరికన్ డాలర్లు (రూ.1.61లక్షల కోట్లు) పెట్టుబడులు వచ్చాయని రాజ్యసభలో ఎంపీ సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, నాచురల్ గ్యాస్ శాఖ మంత్రి సురేష్ గోపి సమాధానమిచ్చారు ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా-గోదావరి బేసిన్ సహా పలు ఆన్‌షోర్-ఆఫ్‌షోర్ ఆయిల్, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా కేజీ-డీడబ్ల్యు ఎన్-98/2 క్లస్టర్-టు ప్రాజెక్టు దాదాపు పూర్తయి భారీస్థాయిలో ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు ఆన్‌షోర్ ప్రాజెక్టుల్లో యుఎస్‌డీ 265.67 మిలియన్, ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల్లో యుఎస్‌డీ 18,979.14 మిలియన్ పెట్టుబడులు జాయింట్ వెంచర్స్ రూపంలో వచ్చాయని తెలిపారు. మొత్తంగా యుఎస్‌డీ 19.25 బిలియన్ (రూ.1.61లక్షల కోట్లు) పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్లు వెల్లడించారు. ఈ రంగంలో పెట్టుబడులు ఆకర్షించడానికి, ఉత్పత్తి వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టినట్లు మంత్రి వివరించారని ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి వచ్చిన ప్రకటనలో తెలిపారు.

మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో

అలాగే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఢిల్లీ పర్యటనలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సహా పలువురు ఎంపీలు కేంద్ర మంత్రులు కేంద్ర ఎరువులు- రసాయనాలశాఖ మంత్రి జేపీ నడ్డాను, కేంద్ర రహదారి రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడులను ఎంపీలు కలిశారు. అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్‌ను టీడీపీ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0 ఎక్స్‌పోజర్ స్టడీ టూర్‌కి కాకినాడ హెల్త్ ఆఫీసర్ ఎంపిక



హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృధ్వి చరణ్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్-అర్బన్ 2.0సర్క్యులర్ ఎకానమీ దృష్టిలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యుఎం) కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు ఈనెల 19 నుంచి 23 వరకు ఎక్స్‌పోజర్ స్టడీ టూర్ నిర్వహించనుంది. ఈ టూర్‌లో పాల్గొనడానికి కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. రాజస్థాన్‌లో మూడురోజులపాటు జరిగే ఈ స్టడీ టూర్‌లో తడి, పొడి వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు, సీబీజీ ప్లాంట్లు, సిఅండ్‌సి వ్యర్థాల ప్లాంటు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, అలాగే ఈ వేస్ట్, స్లాటర్ వ్యర్థాలు, కోడి వ్యర్థాల ప్రాసెసింగ్ సౌకర్యాలను పరిశీలించనున్నారు. ఇతర రాష్ట్రాల యూఎల్‌బీల సౌకర్యాలను సందర్శించి స్థానిక అధికారులతో సమావేశమై వివిధ సామర్థ్యాల ప్లాంట్లను అధ్యయనం చేసి ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేయదగిన ఉత్తమ పద్ధతులపై వివరణాత్మక నివేదిక సిద్ధం చేశారు.

సమాజాభివృద్ధిలో

కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలి

- ఓఎన్జీసీ ఉన్నతాధికార్లతో భేటీ
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం,ఆగస్టు18(ఆంధ్రజ్యోతి) సమాజాభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాస్ తెలిపారు. స్థానిక ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్‌లో సోమవారం ఆయన అసెట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ముఖర్జీ, సీజీఎం రామారావు, డైరెక్టర్ అజిత్‌సింగ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓఎన్జీసీ పరితీరును అడిగి తెలుసుకోడంతో పాటు సీఎస్ఆర్ ఫండ్స్ వినియోగం గురించి ఆరా తీశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు రూ.2కోట్ల వరకూ సీఎస్ఆర్ నిధులలో కొన్ని పనులు ప్రతిపాదించినట్లు దానికి ఓఎన్జీసీ సహకారం అందించాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఇంటర్న్‌షిప్ అవకాశం ఇవ్వాలని సూచించారు. ఓఎన్జీసీ ఈడీ ముఖర్జీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషిస్తున్నామని, ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. రాష్ట్ర మంత్రిగానే కాకుండా వ్యక్తి గతంగా పలు సేవా కార్యక్రమాలు మంత్రి నిర్వహించడం పట్ల అధికారులు ఆయనను అభినందించారు. మొదట పుష్పగుచ్ఛం ఇచ్చిన మంత్రి సుభాష్‌కు స్వాగతం పలికారు.



పుష్పగుచ్ఛం ఇచ్చిన మంత్రి సుభాష్‌కు స్వాగతం పలుకుతున్న ఓఎన్జీసీ ఈడీ ముఖర్జీ

దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ పురస్కార ప్రదానోత్సవం

- డాక్టర్ చిరంజీవినీ కుమారికి మరణానంతరం పురస్కారం ప్రదానం



చిరంజీవినీకుమారి కుమారులకు పురస్కారాన్ని అందజేస్తున్న డాక్టర్ భారతలక్ష్మి

కాకినాడరూరల్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు పద్మవిభూషణ్ డాక్టర్ దుర్గాభాయ్‌దేశ్‌ముఖ్ పురస్కార ప్రదానోత్సవంను సోమవారం ఇంద్రపాలెం లాకుల వద్దగల ఐడియల్ డిగ్రీకళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. అఖిలభారత మహిళాసమాఖ్య నెలకొల్పిన ఈ పురస్కారాన్ని విద్యావేత్త, మహిళాసమాఖ్య పూర్వఅధ్యక్షురాలు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మహిళాసాధికారత రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా మరణానంతరం ఈ అవార్డును ఆమెకు ప్రధానం చేశారు. సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ భారతలక్ష్మి చేతులమీదుగా చిరంజీవినీకుమారి కుమారులు డాక్టర్ పి.గోపాల్, ఐడీయల్ కళాశాలల కార్యదర్శి కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్ తల్లి తరపున పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌పీఎల్ డైరెక్టర్ ఎం.మురళీధర్, డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, డాక్టర్ రత్నగిరి ఉష, డాక్టర్ చందన, రాధికా కృపలాని, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, మీనాక్షి, పద్మజ, దుర్గాంబ, శ్రీదేవి, భానుమతి పాల్గొన్నారు.

రమాదేవి సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ



జేఎన్టీయూకే, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పరిశీలకుల బృందం సిఫార్సు మేరకు గుత్తా రమాదేవి సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీగా జేఎన్టీయూకే ఆమోద ముద్ర లభించింది. ఇన్వెస్టిగేషన్ ఆన్ బయోలాజికల్ యాక్టివిటీస్ ఆఫ్ పాలియజోల్ ట్రాన్సిషన్ మెటల్ కాంప్లెక్సెస్ అనే అంశంపై ఆమె తన సిద్ధాంత వ్యాసాన్ని విజయనగరంలోని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల రసాయన శాస్త్రం విభాగం అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ రజాక్ పర్యవేక్షణలో సమర్పించారు. రమాదేవికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు రసాయన శాస్త్రంలో చేసిన పరిశోధనకు గానూ లభించింది.

21న వీరేశ్వరస్వామికి లక్ష రుద్రాక్ష పూజ

ఐ.పోలవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి ఈనెల21న శ్రావణ బహుళ త్రయోదశి గురువారం సందర్భంగా లక్ష రుద్రాక్ష పూజ నిర్వహించనున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీ నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలతో స్వామికి లక్ష రుద్రాక్షార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహిస్తారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొననున్నారు. ఈపూజలో పాల్గొనదలచిన వారు రూ.250 చెల్లించి టిక్కెట్ తీసుకోవాలని ఆలయ అధికారులు తెలిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు ఈనెల22న దేవాలయంలో రుద్రాక్షల ప్రసాదం అందిస్తారు. పూజ ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

వారాహి అమ్మవారి ఆలయాన్ని గ్రామస్థులకే అప్పగించాలి

- కాకినాడ కలెక్టరేట్ ఎదుట నిరసన

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ స్వాధీనం చేసుకున్న కాకినాడరూరల్ కొవ్వూరులో వారాహి అమ్మవారి ఆలయ నిర్వహణ గ్రామస్థు లకే అప్పగించాలని కాకినాడ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈమేరకు కాళ్ల వీరభద్రరావు కుమార్తె పద్మ లక్ష్మీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆలయాన్ని దేవదాయశాఖ స్వాధీనం చేసుకుందన్నారు. దీన్ని తిరిగి తామే నిర్వహించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. అలాగే గ్రామస్థులకే వారాహి అమ్మవారి గుడి నిర్వహించే అధికారం ఇవ్వాలని గ్రామ ప్రజలు ఒక తీర్మానాన్ని చేశారు.

వారాహి అమ్మవారి ఆలయ ఆదాయం లెక్కింపు

కాకినాడరూరల్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): రూరల్‌మండలం కొవ్వూరులోని దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలోగల శ్రీ వారాహి అమ్మవారి ఆలయ శని, ఆదివారాలకు సంబంధించిన ఆదాయాన్ని ఇన్‌చార్జి ఈవో ఆర్.సౌజన్య ఆధ్వర్యంలో రూరల్ మండలం జనసేన అధ్యక్షుడు కరెడ్ల గోవిందు పర్యవేక్షణలో సోమవారం సాయంత్రం లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.1,16,140 వచ్చిందని ఈవో తెలిపారు. ఈకార్యక్రమంలో బుజ్జి, సతీష్, చిన్నీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద ఉధృతి

- ఎడతెరిపి లేకుండా వర్షాలు
- ఏజెన్సీలో నిండు కుండల్లా వాగులు
- జల దిగ్బంధంలో 16 గ్రామాలు
- నాటు పడవలపై ప్రయాణాలు
- పరిస్థితిని సమీక్షిస్తున్న పీవో, ఏఎస్పీలు



చింతూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి నది

చింతూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో అల్లూరి జిల్లా చింతూరులో శబరి, సీలేరు నదులు ఉధృతం ప్రవహిస్తున్నాయి. కూనవరం వద్ద గోదావరి ఎగ పోటుతో సోమవారం వాగులు, వంకలు నిండు కుండల్లా దర్శనమించాయి. దీంతో ఏపీ మీదుగా ఒడిస్సా వెళ్లే 326 జాతీయ రహదారిపై చింతూరు కుయుగూరుల వద్ద వరద నీరు భారీగా చేరింది. చింతూరు నుంచి భద్రాచలం వెళ్లే 30వ నెంబరు జాతీయ రహదారిపై వరద నీరు భారీగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో 326వ నంబరు జాతీయ రహదారిపై పూర్తిగా రాకపోకలు నిలిచిపోగా 30వ నంబరు జాతీయ రహదారిపై సాహసించి రాకపోకలు సాగిస్తున్నారు. చింతూరు, వరరామచంద్ర పురం మండలాల నడుమ సోకిలేరు, చీకటి వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చింతూరు మండలంలో 16గ్రామాలు జలదిగ్బంధం అయ్యాయి. దీంతో ప్రజలు నాటు పడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరి 38.20 అడుగులు, కూనవరం వద్ద గోదా వరి 32, చింతూరు వద్ద శబరి 33 అడుగుల మేర ప్రవహి స్తున్నాయి. వరద పరిస్థితిని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా సమీక్షిస్తున్నారు. వాగులపై ప్రయాణించవద్దని ప్రజలకు సూచించారు. చింతూరు డివిజన్ వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలకు చెందిన 16మంది గర్భిణులను ఆసుపత్రులకు తరలించినట్టు డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



సోకిలేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో, ఏఎస్పీ



సోకిలేరు వాగుపై నాటు పడవలో గర్భిణుల ప్రయాణం

వరద నీటిలోనే గండిపోశమ్మ ఆలయం



దేవీపట్నంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

దేవీపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో 2 రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో జనజీవనం స్తంభించింది. వ్యాపారులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల సమీపంలో ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీనికి తోడు గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో గోదావరి పరీవాహక ప్రాంతాలైన కొండమొదలు నుంచి పోశమ్మగండి వరకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వరద నీటిలోనే ఉంది. దండంగి-రావిలంక ప్రధాన రోడ్డుపై భారీగా వరద నీరు చేరుకుంది.



గండిపోశమ్మ ఆలయం

గోదావరి పరవళ్లు

కాటన్ బ్యారేజ్ నుంచి 6,07,682 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల



పుష్కర్‌ఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం



ధవళేశ్వరంలో కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. సోమవారం ఉదయం 4.38లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేయగా సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను పూర్తిగా ఎత్తివేసి ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాన్ని వచ్చింది వచ్చినట్టే దిగువకు వదిలివేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ద్వారా 6,07,682 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.10 అడుగులుగా నమోదయింది. కాగా ఎగువున భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుదల నెమ్మదించి సాయంత్రానికి 37.70 అడుగులకు చేరుకుంది. ఎగువున కాళేశ్వరం, పేరూరు, దుమ్ముగూడెం వద్ద నీటి మట్టం తగ్గుముఖం పట్టింది.

ఆల్ క్లియర్ పొజిషన్ ఎందుకు?

ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం వస్తున్న సమయంలోనే మొత్తం కాటన్ బ్యారేజ్ గేట్లను పూర్తిగా ఎత్తివేసి (ఆల్ క్లియర్ పొజిషన్) వచ్చిన ప్రవాహాన్ని వచ్చినట్టు దిగువకు వదిలి వేస్తూ ఉంటారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండానే ఆల్ క్లియర్ పొజిషన్‌లో కాటన్ బ్యారేజ్ గేట్లు ఎత్తి వరద నీటిని సముద్రంలోకి వదిలి వేయాల్సిన పరిస్థితి ఏమిటో అధికారులకే తెలియాలి.



గొల్లప్రోలు పట్టణ శివారు రహదారి, పంటపొలాలను ముంచెత్తిన సుద్దగడ్డ వరద నీరు

సుద్దగడ్డ, చౌటుకాలువలకు పోటెత్తిన వరద

గొల్లప్రోలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో సుద్దగడ్డ, చౌటుకాలువలకు వచ్చిన వరద ఉధృత రూపం దాల్చింది. పంటపొలాలు, రహదారులను వరద నీరు ముంచెత్తింది. రెండు వేల ఎకరాల్లో వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. గొల్లప్రోలు వద్ద గల సుద్దగడ్డ(కొండ)కాలువ, చెందుర్తి సెంటర్ వద్ద గల చౌటు కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గొల్లప్రోలు పట్టణ శివారు కొత్తకాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. వరద నీటిలో నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వరదల కారణంగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నిచ్చెనపై నుంచి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని దాటి వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సుద్దగడ్డ, చౌటు కాలువల వరద ఉధృతి పెరుగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వరదల కారణంగా గొల్లప్రోలు, సీతానగరం, లక్ష్మీపురం, చేబ్రోలు, చెందుర్తి, తాటిపర్తి, చినజగ్గంపేట తదితర ప్రాంతాల్లో 3వేల ఎకరాలకుపైగా వరి, పత్తి, కాయగూరలు తదితర పంటలు ముంపునకు గురయ్యాయి. ఇందులో 2 వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

2వేల ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం

రహదారులపై వరద నీరు

సుద్దగడ్డ, చౌటుకాలువలకు వరదతో గొల్లప్రోలు-తాటిపర్తి, చెందుర్తి-తాటిపర్తి, ఎన్‌హెచ్216-చెందుర్తి, చేబ్రోలు-మల్లవరం, గొల్లప్రోలు శివాలయం మాన్యం రహదారులపై నీరు ప్రవహిస్తోంది. నీటి ఉధృతితో గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపై రాకపోకలు నిలిపివేశారు.

నాయకులు, అధికారుల పర్యటన

సుద్దగడ్డ వరద కారణంగా గొల్లప్రోలు కొత్తకాలనీ వద్ద గల పరిస్థితిని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు తదితరులు పరిశీలించారు. ముంపు బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ముంపు ప్రాంతాల్లో గొల్లప్రోలు తహశీల్దారు గోపాలకృష్ణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు పర్యటించారు.

వీధి కుక్కల దాడిలో పదేళ్ల బాలుడికి గాయాలు

అనపర్తిలో ఘటన



గాయపడ్డ బాలుడు సాత్విక్

అనపర్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి తహశీల్దార్ కార్యాలయ సమీపంలో సోమవారం మధ్యాహ్నం వీధి కుక్కల దాడిలో సాత్విక్ (10) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పాఠ శాలలకు సెలవు కావడంతో స్నేహితులతో బయటకు వచ్చిన సాత్విక్‌పై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. సాత్విక్ కేకలు వేయడంతో స్థానికులు కుక్కలను చెదరగొట్టడంతో బాలుడికి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

అటవీశాఖ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

దేవీపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో దేవారం అటవీశాఖ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని సోమవారం సస్పెండ్ చేసినట్టు ఇందుకూరు రేంజ్ అధికారి కొండలరావు తెలిపారు. ఇటీవల కలప వ్యాపారుల వద్ద లంచం తీసుకుంటూ మీడియా కంటపడడంతో ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ అయింది. దీంతో సీరియస్ అయిన ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి ఆఫీసర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

చించినాడ-దిండి వంతెన మరమ్మతులు ప్రారంభం





చించినాడ-దిండి వంతెన మరమ్మతుల్లో నిమగ్నమైన సిబ్బంది, నిలిచిపోయిన కళాశాలల బస్సులు

మలికిపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చించినాడ-దిండి వద్ద వశిష్ట నదిపై 2 దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన మరమ్మతులను సోమవారం ప్రారంభించారు. ఉదయం నుంచి వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తామని ముందస్తుగా ప్రకటించారు. అయితే భారీ వర్షం కురవడంతో మధ్యాహ్నం వరకు పనుల జోలికి వెళ్లలేదు. మధ్యాహ్నం 2 గంటల నుంచి వంతెనకు ఇరువైపులా పాదచారులను సైతం నిలిపివేశారు. నదిలో వంతెనకు సంబంధించిన 14 పిల్లర్ బేరింగులను కొలతలు వేసే పని చేపట్టారు. పార్ట్ పీటీఎఫ్ బేరింగులు అమర్చవలసి ఉందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. సుమారు 150 మంది వరకు పనులు చేస్తున్నట్టు చెప్పారు. సిబ్బంది వంతెన పియర్స్‌ను పైకి ఎత్తి తద్వారా కొలతలు సేకరించి తదుపరి బేరింగులు అమరుస్తామని తెలిపారు. మళ్లీ గురువారం వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తామన్నారు. వంతెనపై మోటారుసైకిళ్లు, పాదచారులు, చిన్నవాహనాలను నిలిపివేయడంతో వందలాది ప్రయాణికులు వంతెన వద్దకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. హైవే సిబ్బంది ఇరువైపులా ఎటువంటి వాహనాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు ఏర్పాటు చేశారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి వంతెనను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫెయిల్ అయ్యాడని తండ్రి మందలింపు.. ఉరివేసుకున్న ఇంజనీరింగ్ విద్యార్థి

రాయవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో సబ్జెక్టులో ఫెయిల్ అయిన కారణంగా తండ్రి మందలించాడనే కోపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడి గ్రామంలో జరిగింది. సోమవారం రాయవరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల గ్రామానికి చెందిన దంగేటి వెంకటరమణ(19) పసలపూడిలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ రామచంద్రపురంలో ఒక ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బీటెక్ మొదటి సంవత్సరంలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో తండ్రి మందలించాడనే కోపంతో పసలపూడి అమ్మమ్మ ఇంటికి తిరిగి వచ్చి వెదురుపాక-పసలపూడి రోడ్డులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి దంగేటి భద్రం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లై మూడు నెలలు కాకుండానే.. యువకుడి ఆత్మహత్య



లింగాల శేషు (ఫైల్)

ఆలమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మోదుకూరులో యువకుడు ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన లింగం శేషు (25) ఆలమూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన గుంటూరి సుశీల ప్రేమించుకున్నారు. వారి వివాహానికి శేషు తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మే 29న వివాహం చేసుకుని మోదుకూరులో సుశీల ఇంటికి వచ్చారు. మోదుకూరులో మరో ఇంట్లో కాపురం ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం సుశీల, శేషు చర్చికి వెళ్లి ఇంటికి వచ్చారు. అనంతరం సాయంత్రం శేషు ఇంట్లోని ఫ్యాన్‌కి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు భార్య సుశీల ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. కేసు నమోదు చేసి సోమవారం మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కోనసీమ జిల్లా

మోదుకూరులో సంఘటన

చిన్నాయిగూడెంలో విషాదఛాయలు

దేవరపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యువకుడి మృతితో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన లింగాల రాము, సుబ్బలక్ష్మి దంపతుల కుమారుడు శేషు మృతిచెందడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు. వారు మాట్లాడుతూ తమ కుమారుడు శేషు ఆత్మహత్య చేసు కునేంత పిరికివాడు కాదని, దీనిపై పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం చిన్నాయిగూడెం తీసుకొచ్చారు.

నకిలీ కరెన్సీ తయారీ కేసులో ముగ్గురికి యావజ్జీవం

కొవ్వూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీ తయారు చేసిన కేసులో ముగ్గురు నిందితులకు ప్రిన్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవీఎల్ సరస్వతి యావజ్జీవ (14 సంవత్సరాల జైలు) శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం.. 2013లో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామంలో నకిలీ కరెన్సీ తయారుచేస్తుండగా అప్పటి ఎస్‌ఐ ఎం.అర్జునరాజు దాడి చేసి పంగిడికి చెందిన చదలవాడ అనీల్‌కుమార్, తాడి వెంకటరెడ్డి, నర్సీపట్నంకు చెందిన తోమంద్ర రంజిత్‌సింగ్, ఏలూరుకు చెందిన ఎల్లంపల్లి శ్రీనివాసరావు, తిగిరిపల్లి వెంకటేశ్వరరావు, మండా నాగిరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కేసు విచారణలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టు మోనిటరింగ్ టీం డీఎస్పీ జి.దేవకుమార్, రూరల్ సీఐ కె.విజయ్‌బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.శ్రీహరిరావు, కోర్టు కానిస్టేబుళ్లు భవానిప్రసాద్, మేఘనాథం సహకరించగా ప్రాసిక్యూషన్ తరఫున పీపీ వెంకటరమణ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో అనీల్‌కుమార్, రంజిత్‌సింగ్, ఎల్లంపల్లి శ్రీనివాసరావుకు ఒక్కొక్కరికి 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ జడ్జి సరస్వతి తీర్పునిచ్చారు. తాడి వెంకటరెడ్డి, తిగిరిపల్లి వెంకటేశ్వరరావు, మండా నాగిరెడ్డి మృతిచెందినట్టు ఎస్‌ఐ తెలిపారు.

పంటకాల్వలోకి ఒరిగిన ఓఎన్జీసీ ఆయిల్ ట్యాంకర్



ఎస్.యానాం సమీపంలో ప్రధాన పంటకాల్వలోకి ఒరిగిన ఆయిల్ ట్యాంకర్

ఉప్పలగుప్తం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్.యానాం సమీపంలోని జల్లివారిపేట సమీపంలో సోమవారం ఉదయం ఓఎన్జీసీ ఆయిల్ ట్యాంకర్ పంటకాల్వలోకి ఒరిగింది. ట్రాక్టర్‌ను తప్పించే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెప్తున్నారు. ట్యాంకర్ జల్లివారిపేట అన్‌లోడింగ్ పాయింట్‌కు వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ట్యాంకర్‌లో పూర్తిస్థాయిలో క్రూడాయిల్ ఉండడంతో ట్యాంకర్‌ను యథాస్థితికి తెచ్చేందుకు సాయంత్రం వరకు వేచిచూడాల్సి వచ్చింది. రోజంతా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాహనాలను చల్లపల్లి- ఎస్.యానాం బైపాస్ రహదారికి మళ్లించారు. ట్యాంకర్‌లోని క్రూడాయిల్‌ను అన్‌లోడ్ చేసేందుకు సాయంత్రం నుంచి చర్యలు ప్రారంభమయ్యాయి.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కాపాడిన సామర్లకోట ట్రాఫిక్ పోలీసులు



సామర్లకోటలో వివాహితను రక్షించి కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ గరగారావు

సామర్లకోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట అయిదు తూములు సమీపాన రైలు పట్టాలపై ఆత్మహత్యకు యత్నించిన వివాహితను ట్రాఫిక్ పోలీసులు కాపాడి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. సామర్లకోట జగ్గమ్మగారిపేటకు చెందిన పోలవరపు నూకరత్నానికి తునికి చెందిన దుర్గాప్రసాద్‌తో వివాహం కాగా తన భర్త తనను సరిగా చూసుకోకపోవడమే గాకుండా తరచూ వేధింపులకు పాల్పడుతుండడంతో సామర్లకోటలో ఉన్న తన సవతి తల్లి వద్ద సోమవారం తనగోడు విన్న వించుకున్నప్పటికీ పెడచెవిన పెట్టింది. దీంతో తన గోడు ఎవరికి చెప్పుకున్నా ఫలితం ఉండదని భావించి జీవితంపై విరక్తి చెంది నూకరత్నం రైలు పట్టాల వద్దకు చేరింది. అదే సమయంలో కాకినాడ రోడ్డులో గుంతలు పూడ్చేందుకు ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు సిబ్బంది సన్యాసిరావు, ఈశ్వరరావు, రంగారావుతో కలిసి పనులు చేస్తూ పట్టాలపై మహిళ అనుమానాస్పదంగా ఉండాన్ని గుర్తించి హుటాహుటిన చేరకుని రైలు పట్టాల వద్ద నుంచి రోడ్డుపైకి తీసు కొచ్చారు. ఆమెను విచారించగా భర్త వేధింపులు, సవతి తల్లి వివక్షతతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యా యత్నానికి నిర్ణయించుకున్నట్లు వివరించింది. చావే సమస్యలకు పరిష్కారం కాదని పునరాలోచన చేయాలంటూ ఆమెకు ఎస్‌ఐ గరగారావు కౌన్సిలింగ్ ఇచ్చి మానసిక ధైర్యం కల్పించారు. కుటుంబసభ్యులను ట్రాఫిక్ పోలీస్టేషన్‌కు రప్పించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి నూకరత్నాన్ని క్షేమంగా కుటుంబసభ్యులకు అప్పగించారు. ట్రాఫిక్ పోలీసుల కృషిని పలువురు అభినందించారు.


పిఠాపురం బైపాస్‌రోడ్డులో నీట మునిగిన వరి పొలాలు

భారీ వర్షం

● పొంగిపొర్లిన డ్రైన్లు ● నీట మునిగిన వరి పొలాలు

పిఠాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ వర్షం పడటంతో డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరింది. వర్షం కారణంగా ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జనసంచారం అంతంతమాత్రంగానే ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా పిఠాపురం బైపాస్‌రోడ్డు, నరసింగపురం, జములపల్లి, గోకివాడ, రాపర్తి, జల్లూరు, మల్లాం, కుమారపురం తదితర ప్రాంతల్లో వరి పొలాలు ముంపులో చిక్కుకున్నాయి. సుమారు 500 ఎకరాల్లో వేసిన వరినాట్లు, వెదజల్లు సాగుచేసిన పొలాలు ముంపులో ఉండటంతో నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డ, చౌటుకాలువల వరదల కారణంగా గొల్లప్రోలు, చెందుర్తి చేబ్రోలు, లక్ష్మీపురం, మల్లవరం, సీతానగరం తదితర ప్రాంతాల్లో ముంపునకు గురైన వరి, పత్తి పంట పొలాలును సోమవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పరిశీలించారు. వరద నీరు తగ్గగానే పొలంలో 20కిలోలు వంతున యూరియా, పొటాష్ వేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత కార్బండిజమ్ 1 గ్రాము లేదా హెక్సాకొనజోల్ 2మి.లీలను లీటరు నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. ఇప్పటికే 1625 ఎకరాల్లో వరి పంటకు, 225 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని వ్యవసాయాధికారులు తెలిపారు. అయితే మరలా వరదలు రావడంతో నష్టం మరింతగా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. పరిశీలనలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ ఎం.రామభద్రరాజు, డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్, వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, ఏవో కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.


ముంపు చేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


చేబ్రోలు, లక్ష్మీపురంలో పొలాలు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ


కాలనీవాసులకు సూచనలు ఇస్తున్న సీఐ, ఎస్‌ఐలు

నిచ్చెన ఎక్కి బ్రిడ్జి దాటి

● కాలనీకి వెళ్లిన సీఐ, ఎస్‌ఐ

గొల్లప్రోలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డ వరద ఉధృతి ప్రమాదకరంగా మారడంతో గొల్లప్రోలు కొత్తకాలనీవాసులను అప్రమత్తం చేసేందుకు పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణలు చేసిన ప్రయత్నం ప్రశంసలు అందుకుంది. వారు నిచ్చెన ఎక్కి బ్రిడ్జిని దాటి సుద్దగడ్డ వరద నీటిలోనే కాలనీ వద్దకు చేరుకున్నారు. వరద నీటిని దాటుతున్న కాలనీవాసులకు సూచనలు ఇచ్చారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని సూచించారు.

ఏలేరు ఆధునీకీకరణ రద్దుతోనే అవస్థలు

● మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ పనులను రద్దు చేయడం వలనే తరచూ ముంపు సమస్య ఏర్పడి కోట్లాది రూపాయిల ఆస్తి, పంట నష్టం జరుగుతోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, మల్లవరం, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో ఆయన సోమవారం పర్యటించి ముంపునకు గురైన వరి, పత్తి పంటపొలాలును పరిశీలించారు. ఈ పనులు రద్దు కావడానికి నాటి సీఎం జగన్, అప్పటి వైసీపీ ప్రతినిధులు కారణమన్నారు. తామంతా కష్టపడి ఆధునీకరణ పనులకు నిధులు తెస్తే రద్దు కావడానికి ఎవరు కారకులో ప్రజలు గ్రహించాలన్నారు. వెదజల్లు పద్ధతిలో వరి సాగు చేసి పంట నష్టపోయిన రైతులకు వరి విత్తనాలు సరఫరా చేస్తామని కలెక్టర్ చెప్పారని తెలిపారు. జరిగిన నష్టాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని వర్మ భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, నాయకులు పుణ్యమంతుల మూర్తి, వీరబాబు, వీరయ్య, మల్లిబాబు తదితరులు ఉన్నారు.

సామర్లకోటకు తాకిన ఏలేరు ఉధృతి

సామర్లకోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం ప్రాజెక్ట్ నుంచి అదనపు జలాలు విడుదల కారణంగా సామర్లకోట ఏలేరు కాలువలో అధిక నీటిప్రవాహం సోమవారం సాయంత్రం నాటికి చేరుకున్నాయి. సామర్లకోట-పిఠాపురం రోడ్లో సామర్లకోట శివారున ఏలేరు కాలువ నుంచి దిగువకు అధిక నీటి ప్రవాహం చేరడంతో సమీప పొలాలు మాత్రమే గాక టిడ్కో గృహాలకు ముంపు బెడద పొంచి ఉందని అటు రైతులు, ఇటు టిడ్కో నివాసులు ఆందోళన చెందుతున్నారు.

బాధితులకు న్యాయం చేయాలని ధర్నా


కోరింగ పోలీసు స్టేషన్ ముందు న్యాయం కోసం ధర్నాచేస్తున్న దళితులు

తాళ్లరేవు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కోరింగ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ పాతకోరింగ దళితులు కోరింగ పోలీ సుస్టేషన్ వద్ద 216 జాతీయ రహదారిపై బైఠాయించి సోమవారం ధర్నా చేశారు. కాకినాడ-అమలాపురం రహదారికి ఇరువైపులా వాహనాలు స్తంభించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపిన సమాచారం మేరకు పరిస్థితిని గమనించిన కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వ ర్యంలో పోలీసు బృందాలు ధర్నా వద్దకు చేరుకుని ఇరువర్గాలతో చర్చించి బాధిత కుటుంబాలకు న్యాయంచేస్తామని హామీ ఇవ్వడంతో దళితులు ఆందోళన విరమించారు. 216 జాతీయ రహదారిపై ధర్నాచేసి ఆందోళన కారులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

సేవా కార్యక్రమాలు చేయండి

● ఎంపీ సానా సతీష్‌బాబు

సామర్లకోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):జన్మదినం అనేది మన కోసమేకాదు మన పరిసర ప్రాంతాలకు చెందిన వారికి ఉపయోగపడే రోజుగా మారాలి అందుకు నా అభిమానులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు దోహదపడాలని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కోరారు. ఆగస్టు 19న ఎంపీ సానా సతీష్‌బాబు తన జన్మ దినం పురష్కరించుకుని ఎటువంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు, పూలదండలకు ఖర్చు చేయకుండా పేదలకు తోడ్పడే చిన్న చిన్న సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈమేరకు సోమవారం సాయంత్రం సామర్లకోట ఏడీబీ రోడ్డులోని ఎంపీ క్యాంపు కార్యాలయ ఇంచార్జి మేకా లక్ష్మణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

తాళ్లరేవు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి భూదేవి శ్రీకేశవస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారంను దేవస్థానం కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు సోమవారం సభ్యులచే చేయించారు. ఈకార్యక్రమాన్ని ప్రభుత్వవిప్ ఎమ్మె ల్యే దాట్ల సుబ్బరాజు ముఖ్యఅతిథిగా హాజరై ధర్మకర్తల మండలి సభ్యులను సత్కరించారు. ఆలయం అభివృద్ధికి కృషిచేస్తూ ఆలయం భూములను పరిరక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో డీసీ చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, బీసీ జిల్లా అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, మహిళా అధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, ఆసుపత్రి సభ్యులు రోళ్ల శ్రీనివాస చక్రవర్తి, సొసైటీ అధ్యక్షుడు విల్ల ఆదినారాయణ, ధూళిపూడి వెంకటరమణ, గంజా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


కేశవస్వామి ధర్మకర్తల మండలి సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దాట్ల

సైనిక్ భవన్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

కాకినాడక్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సరిహద్దుల్లో విధులు నిర్వర్తించే సైనికుల కుటుంబాలకు ఎటువంటి అవసరం ఏర్పడినా వారికి సత్వర న్యాయం అందించేందుకు లీగల్ ఎయిడ్ క్లినిక్ పని చేయాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సెల్ చైర్‌పర్సన్ జి.ఆనందిని పేర్కొన్నారు. కాకినాడ కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన సైనిక్ భవన్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైనిక కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులతో వస్తూ ఉంటారని వారికి న్యాయపరమైన సూచనలు, సలహాలు చేయాలన్నా రు. కార్యక్రమంలో మాజీ సైనికులు, ఎంఎల్ ఎస్‌ఏ సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు పి.సతీష్‌కుమార్, పీఎల్‌వీ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుడికి వారాహి యువత ఆసరా

● రూ.50వేలు ఆర్థిక సహాయం అందజేత

గొల్లప్రోలు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గుండెకు సంబంధిచిన సమస్యతో బాధపడుతున్న గొల్లప్రోలు పట్టణానికి చెందిన జనసైనికుడు దేవరపు సారధిరామ్‌కు వారాహి యువత మొగలి వెంకట శ్రీనివాస్ టీమ్ అండగా నిలిచింది. అతని శస్త్రచికిత్స నిమి త్తం రూ.50వేలు సమకూర్చింది. ఈ మొ త్తాన్ని పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సోమవారం సారధిరామ్ ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో వారాహి యువత సభ్యులు, జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ


విముక్తి కాలనీ లెప్రసీ వ్యాధిగ్రస్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కాకినాడసిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బాలాజీ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యాయవాది ఏలూరి సుబ్రహ్మ ణ్యం, అపోలో హాస్పటల్ వైద్యుడు డాక్టర్ మనోహర్ ప్రసాద్, జనావళి వృద్ధాశ్రమం అధినేత మందపల్లి శ్యామ్ పేర్కొన్నారు. స్థానిక పేర్రాజుపేట విముక్తి కాలనీలో బాలాజీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అతిథు లుగా పాల్గొని లెప్రసీ వ్యాధిగ్రస్తులకు ఆహార పొట్లా లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మ న్ న్యాయవాది గునిపే బాలాజీ, ట్రస్టీ హేమలత ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మ న్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ట్రస్టను ఏర్పాటు చేశామన్నారు.

'ఆదిత్య'లో అవగాహన సదస్సు

గండేపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు స్త్రీశక్తి-సురక్షిత సమాజం అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సమాజంలో స్త్రీ పాత్ర, ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా వల్ల కలిగే దుష్పరిణామాలపై డాక్టర్ అడపా లక్ష్మీప్రకాష్ వివరించారు. ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫా ర్మసీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన వారోత్సవాలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు.

నేతాజీకి నివాళి

ఏలేశ్వరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని కౌన్సిలర్ అలమండ చలమయ్య పేర్కొన్నారు. సోమవారం స్వాతంత్ర్య ఉద్యమనేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అల మడ దుర్గా వెంకట ప్రసాద్, తూరౌతు గురవయ్య, కందుల ప్రభాకర్, బోద చిరంజీవి, ఉ డతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పంట పొలాలు మునక


పెనుగుదురులో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏవో సత్య

కరప, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మం డల వ్యాప్తంగా పలు హెక్టార్లలో వరిపంట మునిగిపోయింది. మండలంలోని వేములవా డ, వాకాడ, కూరాడ, యండమూరు, తదితర గ్రామాల్లో ఆదివారం సుమారు 175 హెక్టార్లు మునిగినట్టు అధికారులు నివేదిక సమర్పించారు. సోమవారం వరుణుడు శాంతించడంతో వరి పొలాలు ముంపునీటి నుంచి బయటపడ్డాయని మండల వ్యవసాయశాఖాధికారిణి ఇమ్మిడిశెట్టి సత్య తెలిపారు. సోమవారం సాయంత్రానికి పెనుగుదురు, నడకుదురు, గురజనాపల్లి గ్రామాల్లో 15 హెక్టార్లలో పంట నీట మునిగిందన్నారు. ఎగువ నుంచి వస్తున్న ముంపునీటితో వెంకటప్పయ్య డ్రెయిన్ తన్నిపెట్టి ఆయా గ్రామాల్లోని పరివాహక పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు.

ముంపు పరిస్థితిని తెలుసుకోవడానికి సీపీఎం బృందం పర్యటన

కాకినాడ సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గత రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముంపు పరిస్థితిని తెలుసు కోవడానికి సీపీఎం బృందం సోమవారం నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. దుమ్ములపేటలో మెయిన్ డ్రైన్‌ను పరిశీలించి చెత్త పేరుకుపోయి పూడికతో నిండిపోయి ఉండటాన్ని గమనించారు. ఈ ప్రాంతంలో మరుగునీటి నుంచి చెత్తను వేరు చేయడానికి కార్పొరేషన్ ఏర్పాటుచేసిన లిఫ్టింగ్ యంత్రం గత కొంతకాలంగా పనిచేయడం లేదని స్థానికులు వీరి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యుడు మలక వెంకటరమణ మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు శివారు ప్రాంతాల్లో శానిటేషన్ పర్యవేక్షించాలన్నారు మే, జూన్ మా సాల్లో పూడిక తీయించాలని గతంలో కోరామన్నారు. పెరిగిన పని భారానికి అనుగుణంగా సిబ్బందిని పెంచాల్సి ఉందన్నారు. గతంలో కంటే ముంపు సమస్య తగ్గిందని, మెయిన్ డ్రైన్స్ నుంచి ఎప్ప టికప్పుడు చెత్త, పూడిక తొలగిస్తే పూర్తిస్థాయిలో ముంపు సమస్య పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. ఈ బృందంలో మేడిశెట్టి వెంకటరమణఉన్నారు.

కాలనీకు తాగునీరు సరఫరా: ఆర్డీవో

గొల్లప్రోలు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): వరద ముంపులో ఉన్న గొల్లప్రోలు కొత్తకాలనీ తదితర ప్రాంతాలకు ట్యాంకర్లకు పైపులు ఏర్పాటుచేసి తాగునీటిని సరఫరా చేస్తామని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు తెలిపారు. సుద్దగడ్డ వరద ముంపు ప్రాం తాల్లో పరిస్థితులను ఆయన సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పరిశీలించారు. అవసరమైతే కొత్తకాలనీవాసులకు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాకపోకలకు వీలుగా అగ్నిమాపకశాఖ బోటుతోపాటు మరో బోటును అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. మరో రెండు రోజులపాటు భారీవర్షాలు కురిసే అవకాశముందన్న హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. తాటిపర్తి రోడ్డు ద్వారా ట్యాంకర్లును రప్పించి ఇంటింటికా తాగునీటి సరఫరాను నగరపంచాయతీ కమిషనర్ నామ కనకారావు పర్యవేక్షించారు. విద్యుత్ స్తంభాలు పడిపోయాయనే సమాచారంతో ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్, పిఠాపురం డీఈఈ శ్రీనివాస్, గొల్లప్రోలు ఏఈ రామచంద్రరావులు కొత్తకాలనీవద్దకు చేరుకున్నారు.

భారీ వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● కమిషనర్ భావన ఆదేశాలు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వచ్చే రెండురోజుల్లో కాకినాడలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. సో మవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కమిషనర్ భావన కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రత్యేక అధికారులు తమ సిబ్బందిని సిద్ధంగా ఉంచి వర్షాల కారణంగా కలిగే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రధాన కాలువల్లో నీరు నిలిచిపోకుం డా ఎక్స్‌కవేటర్‌లు సిద్ధంగా ఉంచాలని, నీరు నిలిచే ప్రాంతాల్లో మోటార్లను అందుబాటు లో ఉంచాలని అసిస్టెంట్ ఇంజనీర్లకు సూచించారు. పడిపోయే చెట్లను తొలగించేందుకు హార్టికల్చర్ విభాగం, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా వాటర్‌సప్లై విభాగం సన్నద్ధంగా ఉండా లని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థలో ఎక్కడా నీరు నిల్వకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని రాత్రిపూట అత్యవసర పనులకోసం ప్రతీ స్కిల్‌లో కనీసం 10మంది కార్మికులు, మేస్త్రీ, ట్రాక్టర్ అందుబాటులో ఉండేలా చూడాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఎస్ఈ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ పృధ్వీచరణ్, ఏఈ, డీఈలు పాల్గొన్నారు.

పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కరప, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కాకినాడ గొడారిగుంటలోని ఎమ్మెల్యే కార్యాలయంవద్ద సోమవారం పదకొండో దఫా జరిగిన ఈ కార్యక్రమంలో ఏడుగురికి రూ.4లక్షల చెక్కులను అందజేశారు. ఇప్పటి వరకు కాకినాడరూరల్ నియోజకవర్గం పరిధిలోని 105 మందికి రూ.1.13కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీలను అందించినట్టు ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. జనసేనపార్టీ మండలాధ్యక్షుడు బండా రు మురళి, కూరాడ సొసైటీ అధ్యక్షుడు వెలుగుబంట్ల సూరిబాబు, పుల్లా శ్రీరాములు, రామకృష్ణ, కోటిబాబు పాల్గొన్నారు.

పి4 కార్యాలయ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే

పెద్దాపురం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): విజన్ 2047(పి4) కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో పి4 కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఆర్డీవో కె.శ్రీరమణి ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విజన్ 2047 కార్యక్రమం ద్వారా ప్రతీ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన పరిపాలన, సదుపాయాలు అందించడమే ముఖ్యలక్ష్యమన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈవిధమైన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందన్నారు. ఆర్డీవో శ్రీరమణి మాట్లాడుతూ నూతన భవనం అందుబాటులోకి రావడంతో కార్యాలయ పనితీరు మరింత సమర్థవంతంగా సాగుతుందన్నారు.


కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

నేడు ఏపీ మాల కోఆపరేటివ్ ఆర్థిక సహకార సంఘం చైర్మన్ రాక

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాల కోపరేటివ్ ఆర్థిక సహకార సంఘం చైర్మన్ డాక్టర్ పెదపాటి విజయ్‌కుమార్ కాకినాడ జిల్లాలో మంగళవారం పర్యటించనున్నారు. కార్యక్రమాల వివరాలు.. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో డైరెక్టర్‌లు, ఎస్‌సి ప్రతినిధులతో సమావేశం 11.30 నుంచి 12గంటల వరకు కార్యాలయ సిబ్బందితో సమావేశం, మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశం, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 4గంటల వరకు పెద్దాపురం షాపింగ్ కాంప్లెక్స్ క్షేత్ర పర్యటన. మధ్యాహ్నం 4గంటలకు 4.30గంటల వరకు పత్రికా సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుడు తెలిపారు.

సీలింగ్ భూముల రైతులకు న్యాయం చేయండి

పెద్దాపురం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కెయి చిన్నాయ్యపాలెం గ్రామంలో సర్వేనెం. 101/4ఎ, 178/2 ఎల్‌సీసీ సీలింగ్ భూములను సాగు చేసుకుంటున్న దళితులకు న్యాయం చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. గత 30 సంవత్సరాలకు పైగా సాగు చేసుకుంటున్న సీలింగ్ భూమిని కబ్జా చేయడానికి తప్పుడు రికార్డులతో అనేక ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి దళితులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

'దళిత మహిళలపై అత్యాచారాలు పెరిగాయి'

పిఠాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత విమర్శించారు. శ్రీకాకుళంజిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మె ల్యే కూన రవికుమార్, మరికొందరు నేతల వేధింపులు, సోషల్‌మీడియాలో దుష్ప్రచారంతో కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య ఆత్మహత్యాయత్నం చేశారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని, బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేబ్రోలులో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల ఆందోళన

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అనంతపురంఅర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని గాంధీ విగ్రహంవద్ద సోమవారం సాయంత్రం జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఆందోళనకు దిగారు. అనంతపురం ఎమ్మెల్యే తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు నూజివీడు సూర్య, ఉపాధ్యక్షుడు సింగినీడి శ్రీను, అభిమానులు పాల్గొన్నారు.

కవి సూర్యారావుకు సత్కారం


కవి సూర్యారావును సత్కరిస్తున్న గాయకుడు గజల్ శ్రీనివాస్

కాకినాడ సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన విశ్వసాహితీ కళావేదిక ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో రచయిత, కవి డా క్టర్ తురగా సూర్యారావును గాయకుడు గజల్ శ్రీని వాస్ శాలువాతో సత్కరించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రమావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడకు చెందిన రచయిత డాక్టర్ జ్ఞానానంద కవిపై రాసిన కవితను సూర్యారావు సభలో చదివి వినిపించగా ఈ సత్కారం అందుకున్నారు. ఆయనను రచయిత కవి డాక్టర్ పూర్ణచందు తదితరులు అభినందించారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడిగా నియమితులైన జీను మణిబాబును స్థానిక జేవియర్ అపార్టెమెంట్ వద్ద గోవిందపురం సర్పంచ్ కమ్మిల వెంక టేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కమ్మిల దుర్గాప్రసాద్, కొల్లు రామకృష్ణ, పద్మనాభం తదితరులున్నారు.



టీడీపీ మండలాధ్యక్షుడికి సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడిగా నియమితులైన జీను మణిబాబును స్థానిక జేవియర్ అపార్ట్‌మెంట్ వద్ద గోవిందపురం సర్పంచ్ కమ్మిల వెంక టేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కమ్మిల దుర్గాప్రసాద్, కొల్లు రామకృష్ణ, పద్మనాభం తదితరులున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఏజెన్సీలో జోరువాన

పలు చోట్ల రహదారులపై కూలిన భారీ వృక్షాలు

కూనవరం- భద్రాచలం రోడ్‌లో నిలిచిన ట్రాఫిక్



బుట్టాయిగూడెంలో రహదారిపై కూలిన భారీ వృక్షం

ఎటపాక, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం ఎటపాక ఏజెన్సీలో జోరువాన కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం పడడంతో జనజీవనానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. వర్షం దాటికి బుట్టాయిగూడెం సమీపంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలిపోయింది. దీంతో కూనవరం- భద్రాచలం రోడ్‌లో కొన్ని గంటలు వాహన రాకపోకలు నిలిచిపోయాయి తహశీల్దార్ కారం సుబ్బారావు, సీఐ కన్నపరాజు, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎస్ఐ అప్పలరాజులు అక్కడికి చేరుకుని, జేసీబీ, కూలీల సాయంతో భారీ వృక్షాన్ని తొలగించారు. లక్ష్మీపురం గ్రామ శివారులో జాతీయ రహదారిపై చెట్టు, తోటపల్లి గ్రామంలో వృక్షం కూలింది. వర్షానికి కావలరంలో బాలకృష్ణ ఇంటి స్లాబ్ కొంతభాగం రేకుల షెడ్డుపై విరిగి పడింది. కృష్ణవరం- జగ్గుగుట్టు గ్రామాల మధ్యలో రహదారిపై కల్వర్టు వద్ద వరదనీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలకు గిరిజనులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. మోకాళ్ల లోతు వరదనీటిలో ప్రమాదభరితంగా గిరిజనులు రాకపోకలు సాగించారు.

అధిక వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

మారేడుమిల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న భారీ వర్షాలకు కొండ వాగులు పొంగిపొర్లుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మారేడుమిల్లి సీఐ టీగోపి నరేంద్రప్రసాద్ సూచించారు. వైరామవరం ఏగువప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు వాగులను దాటవద్దన్నారు. మారేడుమిల్లిలో పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశారన్నారు. గ్రామాల్లోని ఆరోగ్య పరిస్థితులపై జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసర సమయంలో 94409 00751 మారేడుమిల్లి సీఐ, 94409 04866 ఎస్ఐ మారేడుమిల్లి నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నిలిచిన రాకపోకలు

రాజవొమ్మంగి ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలో కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మెట్టిమెట్ల-లాగరాయి, నెల్లిమెట్ల-నెల్లిమెట్ల కాలనీ, వట్టిగెడ్డ-ఎర్రంపాడు గ్రామాల మధ్యలో ఆర్‌అండ్‌బీ రహదారిపై సప్పాల సైనుంచి కొండవాగులు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 60గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు కాలువలు దాటకుండా కాలువల వద్ద నలివాలయ సిబ్బంది దిని అధికారులు గస్తీ పెట్టారు. తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరీశ్వరావు మండలంలోని అన్ని వాగులను పరిశీలించారు.

భారీ వర్షాలకు ఉప్పొంగిన వాగులు

మోతుగూడెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మోతుగూడెం-పొల్లూరు మధ్య కల్వర్టుపై వరదనీరు ప్రవహించడంతో 6గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు తహశీల్దార్ హస్సేన్, ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రావు, మోతుగూడెం పరిధిలో పొంగి ప్రవహిస్తున్న వాగులు, నీలేరు నదిని పరిశీలించి ఆ నదిపై ఉన్న వడపరేవుల్లో పడవల రాకపోకలను నిలిపివేయాలనిఆదేశించారు. పొల్లూరు జలపాతాన్ని తాత్కాలికంగా మూసివేశారు.

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రంపచోడవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షా నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో కట్టా సింహచలం అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్, సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్‌తో కలిసి ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేకాధికారులతో భారీ వర్షాలకు తీసుకోవలసిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ వర్షాలు తగ్గేవరకు పర్యాటక ప్రాంతాలను అనుమతించరాదన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు తగ్గేవరకు అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్స్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్లు 18004252532, 08864243561 ఏర్పాటు చేశామన్నారు.

ఉధృతంగా గోదావరి ప్రవాహం

దేవీపట్నం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఏజెన్సీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షరీఫ్ అన్నారు. ప్రజలు వాగులు దాటవద్దని, చేపలు పట్టడానికి కాలువల వద్దకు వెళ్లరాదన్నారు. గోదావరి నది ప్రవాహం ఉధృతంగా ఉందని నది పరీవాహక ప్రాంతాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే వెంటనే 1912కు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో మోటారు వాడకం తగ్గించాలని, తడి చేతులతో స్విచ్‌లను తాకరాదన్నారు.


పోలవరం నిర్వాసితుల పక్షాన పోరాడాలి

చింతూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోండ్వానా గోండ్ ప్రతినిధులు పోలవరం నిర్వాసితుల పక్షాన పోరాడాలని ఆ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ కుమార్ నేతం పేర్కొన్నారు. దక్షిణ రాష్ట్రాల పర్యటనలో భాగంగా గోండ్వానా ప్రతినిధుల సంఘం సోమవారం చింతూరు చేరుకుంది. సంఘ ఆంధ్రప్రదేశ్ విస్తరణ సమావేశం నిర్వహించారు.తరుణ్ కుమార్ నేతం మాట్లాడారు. స్థానిక సంఘాలతో కలిసి పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమానికి సెంట్రల్ కమిటీఆర్గనైజర్ మడివి నెహ్రూఅధ్యక్షత వహించారు.

రాష్ట్ర కన్వీనర్‌గా రామారావు దొర

గోండ్వానా మహాసభ రాష్ట్ర అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు.రాష్ట్ర అడహక్ కమిటీ కన్వీనర్‌గా పాడేరుకు చెందిన రామారావుదొర, కో కన్వీనర్‌గా ఏలూరు జిల్లాకు చెందిన సోడెం ముక్కయ్య, రంపచోడవరంకి చెందిన కంగాల శ్రీనివాస్ తదితర కార్యవర్గం ఎన్నికైంది. ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 27 అర్జీలు



రంపచోడవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను ఐటీడీఏ పీవో కట్టా సింహచలం, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ స్వీకరించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ పింఛన్ల మంజూరు, భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ 27అర్జీలు అందాయన్నారు. అర్జీలను పరిశీలించి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, షరీఫ్, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, డీఎల్‌డీవో కెజోత్స్నరావు, పీహెచ్‌వో దేవదానం, డీసీసీ డీఎం జయశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బస్సుల పార్కింగ్‌కు స్థల పరిశీలన

ఎటపాక, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా ఎటపాక వచ్చే ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలం కోసం సోమవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డీటీడీవో వైఎస్ఎన్ మూర్తి స్థలాన్ని పరిశీలించారు. ఎట పాకలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో పాటు ఇతర చోట్ల స్థల సేకరణపై తహశీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌తో కలిసి పరిశీలించారు.

భారీ వర్షాలు.. మునిగిన పొలాలు

ఆందోళనలో రైతులు

వ్యవసాయాధికారుల సూచనలు





ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో ముంపు బారిన పడిన పొలం, జగ్గంపేట మండలం రామవరంలో పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ

ప్రత్తిపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. వరినాట్లు వేసిన 1200 ఎకరాల వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. మరో 500ఎకరాలు పత్తి, అరటి, మిర్చి, కూరగాయల పంటలు ముంపునకు గురయ్యాయి. దీంతో మండలంలోని రైతులు పొలాలు చూసి భయాందోళన చెందుతున్నారు. మరో 3రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పంట లు కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. అధిక వర్షాల కారణంగా నీటమునిగిన ఆయా గ్రామాల్లో పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రామభద్రరాజు, డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్, మండల వ్యవసాయాధికారి జోశ అమ్మతల బృందం పరిశీలించారు. పంటలను రక్షించుకోవడానికి రైతులకు సూచనలు చేశారు. కాలువల ద్వారా నీటిని బయటకు తరలించి ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల యూరియట్ ఆఫ్ పొటాష్ బూస్టర్ డోసులుగా వేయాలని సూచించారు. 2 రోజులు కురిసిన వర్షాలకు మండలంలోని ప్రాజెక్టులు, చెరువులు నిండాయి.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగపతినగరం, కిర్లంపూడి గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను సోమవారం వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు పరిశీలించారు. జగపతినగరంలో 30 ఎకరాలు, కిర్లంపూడిలో 45 ఎకరాలు ముంపునకు గురైనట్టు ప్రాథమిక అంచనా వేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి సుమారు 500 ఎకరాలు ముంపులో ఉన్నట్టు గుర్తించామని వారు తెలిపారు. కిర్లంపూడి మండలంలోని ముక్కొల్లు, రా జుపాలెం గ్రామాల్లో గట్టదాటి నీటమునిగిన ప్రాంతాలను కిర్లంపూడి తహశీల్దార్ చిరంజీవి, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ జిఎస్ఏ్క్ పరిశీలించారు.

జగ్గంపేట/ జగ్గంపేట రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలో రామవరం దిగువన ఉన్న వరి సుమారు 175 ఎకరాల వరకు పొలాలు ముంపునకు గురయ్యాయి. పొలాలను వ్యవసాయశాఖ ఏడీఏ జిజీని వాస్, మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం లు పరిశీలించారు. అగ్రి కల్చర్ ఏడీఏ జీశ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వర్షాభావం వల్ల పంట ముం నక తక్కువగా నే ఉందని, ఈ 2రోజుల్లో కురి సే వర్షాలను బట్టి పూర్తి స్థాయిలో పంట నష్టం అంచనా తెలుస్తుందన్నారు. ప్రతిగ్రామంలో వ్యవసాయ అధికారులు నిరంతరం రైతులకు అందు బాటులో ఉండాలని ఆదేశించారు. మూడు మండలాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్టు చెప్పారు.



కిర్లంపూడి: ముంపునకు గురైన వరిపొలాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉచిత బస్సు ప్రయాణంపై దుష్ప్రచారం తగదు

ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు స్త్రీ శక్తి పేరుతో ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం తగదని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తీవ్రంగా ఖండించారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పథకం ప్రారంభించిన 3 రోజులకే పెయి ల్యూర్ అని విమర్శిస్తూ సాక్షి పత్రికలో కథనాలు రాయడంపై మండిపడ్డారు. ఎక్స్‌ప్రెస్‌లో ఉచితం లేదంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తుందని, గోకవరం డిపోకు సంబంధించి 54 బస్సులు ఉంటే అందులో ఉచిత బస్సు పథకం 42 బస్సులకు వర్తిస్తుందన్నారు. ఇదేవిధంగా రాష్ట్రమంతా అమలు జరుగుతుందన్నారు. పథకం వల్ల ఎన్నో కుటుంబాలు లబ్ధి పొందుతున్నా యని వివరించారు. త్వరలోనే ఆటో కార్మి కుల కోసం మంచి ప్రతిపాదన నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. నియోజకవర్గం లో ఆటో కార్మికులను ఆదుకునేందుకు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

తాత్కాలికంగా జ్యోతుల నెహ్రూ ఫౌండేష న్ ద్వారా 2000 మందికి 25 కిలోల చొప్పున బియ్యం అందజేయడం జరుగుతుందని తెలిపారు. జీను మణిబాబు, ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆడపా భరత్, కందుల చిట్టిబాబు, ఆడపా తాతాజీ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాల యంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో మామిడాడ గ్రామా నికి పలువురు టీడీపీలో చేరారు. మామి డాడ గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపా ధ్యాయుడు పసగడుగుల బాబూరావు, గం డేపల్లి మండలం జెడ్ రాగం పేట గ్రామా నికి చెందిన రిటైర్డ్ ఎంఈవో కంటిఉండి భాస్కర్ చౌదరి తమ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షం లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

పేదలకు అన్నదానం

జగ్గంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్న క్యాంటీన్‌లో టీడీపీ కిర్లంపూడి మండలాధ్యక్షుడు వీరం రెడ్డి రామలింగేశ్వర స్వామి (కాశి బాబు) ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై భోజనాలు వడ్డించారు. ఎస్వీఎస్ అప్పల రాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, బుర్రి సత్తిబాబు, రాయి సాయి, చాగంటి వీరవెంకట సత్యనారాయణ, దేగల సత్తి బాబు, ఎస్వీప్రసాద్ తదితరులున్నారు.

కత్తిపూడి సత్రం చైర్మన్‌గా చంద్రమౌళి



చంద్రమౌళిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రౌతులపూడి/శంఖవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి శ్రీరాజా వత్సవాయ బుచ్చి సీతయ్యమ్మ రాణిగారి సత్రం చైర్మన్‌గా రౌతులపూడి మండలం బలరామపురం గ్రామానికి చెందిన సోమరౌతు చంద్రమౌళి నియమితులయ్యారు. దీంతో బలరామపురంలో సంబరాలు చేసుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ చంద్రమౌళిని కలిసి ఘనంగా సన్మానించారు. సొసైటీ అధ్యక్షుడు పైలపైడిరాజు, ఎంపీటీసీ సోమరౌతు రవి, నాయుడు, కేసత్తిబాబు, జెట్టా రాజా, లెక్కల రాము, బులుశెట్టి అశోక్, పిల గడుల రమణ, తంతపరెడ్డి అప్పారావు, కోరుప్రోలు బుజ్జిబాబు నాయుడు, యగదాసు హరిబాబు, మండల క్లారిక్షన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కిక్కిరిసిపోతున్న ఆర్టీసీ బస్సులు



ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహిళల కోలాహలం

ప్రత్తిపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ స్త్రీశక్తి పథకానికి అనూహ్యమైన స్పందన వస్తుంది. ఆ ర్టీసీ బస్సులు మహిళలతో కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా తుని, రాజమండ్రి మధ్య 110 కిలోమీటర్ల దూరంలో 26 బస్‌స్టాప్‌లు ఉండగా ప్రతి బస్‌స్టేజ్ వద్ద వందలాది మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించేందుకు తరలివస్తున్నారు. సోమవారం భారీ వర్షం కురిసినా బస్సుల్లో ప్రయాణించేందుకు మహిళలు పోటెత్తారు. ప్రతి స్టేజ్‌లోను పెద్ద ఎత్తున ప్రయాణికులను ఎక్కించడం, దించడంతో అధిక సమయం పడుతోంది. ఫలితంగా బస్సులు స్టేజ్‌ల వద్ద సమయం ప్రకారం రాలేని పరిస్థితి ఉంది.

తుని డివిజన్‌లో 802 ఎకరాల పంట మునక



కోటనందూరు: కొత్తూరు కండివద్ద నీట మునిగిన వరి పంట



తొండంగి: కొమ్మనాపల్లిలో నీటముసిగిన శ్మశానవాటిక

కోటనందూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి పంట లకు భారీగా నష్టం వాటిల్లిందని తుని సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ కేజే చంద్రశేఖర్ తెలిపారు. తుని సబ్ డివిజన్‌లో 802ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. తుని మండలంలో వరి 20ఎకరాలు, పత్తి 140ఎకరాలు, తొండంగి మండలంలో వరి 327, కోటనందూరు మండలంలో వరి 25, రౌతులపూడి మండలంలో వరి 132, పత్తి 150 ఎకరాలు, శంఖవరం మండలంలో వరి 15 ఎకరాలు, పత్తి 5ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందన్నారు. రైతులు జాగ్రత్తలు తీసుకుని నీరు పోయేటట్టు చూసుకోవాలని రైతులకు సూచించారు. ఈమేరకు ఆయా మండలాలకు సంబంధించిన రెవెన్యూ,వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించారు. అందులోభాగంగా కోటనందూరు తహశీల్దార్ పీవీవిసత్యనారాయణ, అగ్రికల్చర్ గీత వ్యవసాయ శాఖ సిబ్బంది పంటను పరిశీలించారు.

కత్తిపూడి - దుర్గాడ రోడ్డు మునక

శంఖవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు నీట మునిగాయి. శంఖవరం, కత్తిపూడి, నెల్లిపూడి, కొంతంగి గ్రామాల్లో రోడ్లపైకి నీరు చేరుకుంది. శంఖవరం లో కొన్ని చోట్ల పొలాలు ముంపునకు గురయ్యాయి. కత్తిపూడి నుంచి దుర్గాడ వెళ్లే రహదారి పూర్తిగా నీట మునగడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సచివాలయం-2 సమీపంలో రోడ్డుపైకి నీరు చేరుకుంది. హైవే నిర్మాణంలో అధికారులు తప్పిదాలు కారణంగా చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ కాలువ నీరు చేరుకుంటుంది. శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

తొండంగి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఆదివారం జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదుకాగా సోమవారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. పంపా వరద గేట్లు ఎత్తివేయడంతో పంపాకాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొమ్మనాపల్లిలో శ్మశానవాటిక పూర్తిగా నీట మునిగింది. కొంత మేర వరిపొలాలు నీట మునిగాయి. పి.అగ్రహారం సమీపంలో పంపా కాల్వలు పొంగి పొర్లడంతో వరి పొలాలు నీట మునిగాయి. తహశీల్దార్ టి.కాంతారావు, అగ్రి రాజారావులు ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. ఏకత్తపల్లి ఆవ నీట మునిగింది. మండల రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది.

బాధితులు ఫిర్యాదు చేయండి

తునిరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీలు చెల్లిస్తామని, బంగారం తక్కువ ధరకు ఇప్పిస్తామని ఆశ చూపించి పలువురి దగ్గర నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేసి పరారైన సత్యవరం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావుపై తుని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. వెంకటేశ్వరరావు పట్టణంలోని నక్కిన వీధిలో శ్రీలక్ష్మీనివాస జ్యువెలర్స్ బంగారు షాపు కేంద్రంగా మోసాలు చేసినట్టు గుర్తించామన్నారు. ఇంకా ఎవరైనా వెంకటేశ్వరరావు చేతిలో మోసపోయి ఉంటే తక్షణమే తుని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ కోరారు.

22న అన్నవరంలో వరలక్ష్మీ వ్రతాలు

కిర్లంపూడి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఈనెల22న అన్నవరం దేవస్థానంలో జరిగే సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్టు సత్యదేవ ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు తెలిపారు. సోమవారం గెద్దనాపల్లి, చిల్లంగి, కిర్లంపూడి, బూపాలపట్నం, జగపతినగరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వ్రతానికి హాజరయ్యే భక్తులు అరటిపళ్లు, కొబ్బరికాయ, పువ్వులు తెచ్చుకోవాలన్నారు.గాజులు, జాకెట్‌ముక్క, ప్రసాదం, పూజా సామగ్రి దేవస్థానం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉలూరి త్రిమూర్తులు, అడారి అరుణ కుమారి, కృష్ణతులసి, నాగమణి తదితరులున్నారు.

అధ్వానంగా పీహెచ్‌సీ రోడ్డు



గండేపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ రహదారులు అధ్వానంగా మారాయి. గండేపల్లి పీహెచ్‌సీకి వెళ్లే రహదారి బురదమయంగా మారడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత కాలంగా పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డుమార్గాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడంలేదని పలువురు రోగులు అంటున్నారు.

తుమ్మలపల్లి పరామర్శ



మారోతి శివ గణేష్‌ను పరామర్శిస్తున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలభద్రపురంలో కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి మారోతి శివగణేష్‌ను జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. శివ గణేష్ అన్నయ్య గోపాలరావు ఇటీవల మరణించడంతో తుమ్మలపల్లి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాదారపు వీరబాబు, గండం సిదియ్య, గండం వెంకన్న,మణికంఠ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో అవగాహన సదస్సు

గండేపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు స్త్రీశక్తి-సురక్షిత సమాజం అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సమాజంలో స్త్రీ పాత్ర, ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా వల్ల కలిగే దుష్పరిణామాలపై డాక్టర్ ఆడపా లక్ష్మి ప్రకాష్ వివరించారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన వారోత్సవాలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెరవిశంకర్ తెలిపారు.

బాధితుడికి సాయం

ప్రత్తిపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన నల్లా వెంకటరమణకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు సోమవారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అగ్నిప్రమాదంలో గాయపడ్డ దంగా అప్పారావును పరామర్శించారు. ఎంపీటీసీ జున్నం సుబ్రహ్మణ్యం, బొల్లు నాగేశ్వరరావు, పోలనాటి వెంకటేశ్వర్లరావు,తోపాటి బాబ్జి టి.రాజా ఉన్నారు.

కత్తిపూడి ఆర్టీసీ బస్టాండ్ వద్ద తాగుబోతు వీరంగం



కంట్రోలర్ విభాగం వద్ద తాగుబోతు

ప్రత్తిపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో సోమవారం సా యంత్రం ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. బస్టాండ్‌లో పని చేసే మహిళా స్వీపర్ ఆ తాగుబోతును కాంప్లెక్స్‌లోని కుర్చీపై కూర్చోవద్దని చెప్పిన స్వీపర్‌పై తాగుబోతు కర్రతో దాడి చేయబోయాడు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఆర్టీసీ కంట్రోలర్‌ను లెక్కచేయకుండా వీరంగం సృష్టించడంతో ప్రయాణికులు భయపడ్డారు.

నేతాజీకి నివాళి

ఏలేశ్వరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని కౌన్సిలర్ అలమండ చలమయ్య పేర్కొన్నారు. సోమవారం స్వాతంత్ర్య ఉద్యమనేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో అలమండ దుర్గా వెంకట ప్రసాద్, తూతోట గురవయ్య, కందుల ప్రభాకర్, బోద చిరంజీవి, ఉదతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

'శ్రీప్రకాష్' వ్యవస్థాపక వేడుకలు ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తునిరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈసందర్భంగా గాతా రోహ మేరా దిల్ కార్యక్రమం నిర్వహించినట్టు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. గాతా రోహ మేరా దిల్ కార్యక్రమంలో విద్యార్థుల పాటలతో అలరించారు. ఈవేడుకలకు తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలో ఉన్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని విజయప్రకాష్ తెలిపారు. ఆతిందియా దేవిడా, దూరదర్శన్ గాయకులు అర్‌సునీత మాట్లాడుతూ 49సంవత్సరాల విద్యాసంస్థల పయనంలో అనేకమంది మేధావులను, ఉన్నతాధికారులను సమాజానికి అందించిందని కృషిచేసిన విద్యాసంస్థల వ్యవస్థాపకుడు నరసింహారావు అభినందనీయులన్నారు. విద్యాసంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ మూర్తి, వీడీఎస్‌ఎస్ భానుమూర్తి, డాక్టర్ వీవీఎస్‌వీ బంగ్రాజు, డాక్టర్ ఎం.అప్పారావు, బీసీతా రాణి, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.